Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 195 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 5 ఆగస్టు 2023 | శనివారం | పేజీలు : 4

## మళ్లీ వెనక్కి వెళ్లిన సముద్రం..

చెన్నై : ప్రపంచ సముద్రతీర పర్యాటక ప్రాంతమైన కన్నియాకుమా రిలో సముద్రం వెనక్కి వెళ్లింది. ఇలా జరగడం వరుసగా మూడోరోజు కాగా, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. త్రివేణి సంగ మంగా భాసిల్లుతున్న కన్నియాకుమారి సముద్రతీరాన్ని చూసేందుకు ప్రతి రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు సూర్యోదయం, సూర్యాస్తమ యాలను చూసి అమితానందం పొందుతుంటారు. అలాగే, సముద్రం మధ్యభాగంలో నిర్మించిన వివేకానంద రాక్ మెమోరియల్ ఫోర్ట్, తిరువళ్లువర్ విగ్రహాలు కూడా పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. అదే సమయంలో ఇక్కడ సముద్రంలో పడవ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా సాగుతుంది. అలాంటి పర్యాటక ప్రాంతంలో సముద్ర జలాలు ఒక్కసారిగా వెనక్కి వెళ్ళిపోయాయి. దీంతో పూంపుహార్ బోటింగ్ కార్పొరేషన్ పడవ ప్రయాణాన్ని 4 నుంచి 8 గంటల పాటు నిలిపివేసింది.

# కేసీయార్ సైలెంట్ వెనక

# సైలెంట్ గేమ్ ప్లాన్...?



హైదరాబాద్ : కేసీయార్ అంటేనే వ్యూహాల పుట్ట. అపర చాణక్యం ఆయన సొంతం. మాటల మాంత్రికుడిగా పేరు. అలాంటి కేసీయార్ తెలంగాణా లో ఎన్నికలు దగ్గర లో పడినా కూడా పెద్దగా సౌండ్ చేయడంలేదు. ఆ మాటకు వస్తే అసలు తెలంగాణాలోనే పెద్దగా ఉండడంలేదు ఆయన బీయరెస్ పార్టీ విస్తరణ అంటూ దేశమంతా తిరుగుతున్నారు. మహారాష్ట్రా ఎన్నికలు 2024 అక్టోబర్ లో ఉంటే అక్కడకు వెళ్లి కేసీయార్ బిగ్ సౌండ్ చేస్తున్నారు. మహారాష్ట్రలో సభలు సమావేశాలతో టైం పాస్ చేస్తున్నారు. అదే విధంగా ఢిల్లీ రాజకీయాల మీద ఫోకస్ పెంచుతున్నారు. మోడీ సర్కార్ మీద అవిశ్వాసం పెట్టడంతో పాటు మోడీ ప్రభుత్వం మీద ఏ కూటమితో సంబంధం లేకుండా పోరాడుతామని చెబుతున్నారు. అయితే తెలంగాణా రాజకీయం మారుతోంది. పూటకో బడా నేత వెళ్ళి కాంగ్రెస్ లో కలుస్తున్నారు. బీయారెస్ గెలవదు అంటూ ఆ నేతలే చెబుతున్నారు. ఇక పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దూకుడు అయితే మామూలుగా లేదు, మాజీ మంత్రి జూపల్లి క్రిష్ణా రావు కాంగ్రెస్ లో చేరిన సందర్భంగా కేసీయార్ ని కాస్తా చార్లెస్ శోభరాజ్ శిష్యుడు అంటూ హాట్ హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీ కూడా తెలంగాణాలో విస్తరించాలని తాపత్రయపడుతోంది. అందరి చూపూ కేసీయార్ మీదనే. ఒక మాట అని పది మాటలు అనిపించుకుని మళ్లీ దానికి వడ్డీ చెల్లించాలని విపక్షాలు ఆరాటపడుతూంటే కేసీయార్ నుంచి మాత్రం నో సౌండ్ అన్నట్లుగా సీన్ ఉంది. ఇక ఎన్నికలు దగ్గరపడుతూంటే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వంటి చర్యలతో బీయారెస్ చాలా సైలెంట్ గా తన పని తాను కానిచ్చేస్తోంది. సౌతిండియలో తొలి హ్యాట్రిక్ సీఎం కేసీయార్ అని మంత్రి కేటీయార్ అంటున్నారు. బీయారెస్ గెలిచి తీరుతుందని చెబుతూ కేటీయార్ మాట్లాడుతున్నారు కానీ కేసీయార్ మాత్రం నోరు విప్పడంలేదు. అయితే కేసీయార్ సైలెంట్ ఎందుకు దాని వెనక ఏముంది అన్నదే ఇపుడు రాజకీయ విశ్లేషకుల కు సైతం అర్ధం కావడంలేదు అయితే కేసీయార్ మాట్లాడినా సైలెంట్ గా ఉన్నా కూడా అది కూడా వ్యూహమే అని అంటున్నారు. కేసీయార్ ఇపుడు సైలెంట్ గా ఎందుకు ఉన్నారంటే దానికి కూడా అర్ధాలు పరమార్ధాలు ఎన్నో ఉన్నాయని అంటున్నారు. ఇపుడు కనుక కాంగ్రెస్ మీద కానీ బీజేపీ మీద కానీ సెటైర్లు వేసినా లేక కౌంటర్లు వేసినా అటు వైపు నుంచి భారీ ఎత్తున ఎన్ కౌంటర్లు రెడీగా ఉంటాయి. అలా వారూ వీరూ అన్నట్లుగా పోటీ నడుస్తుంది. మాటల తూటాలు వాడిగా వేడిగా పేలుతాయి. ఈ సందట్లో విపక్షాలు ఒక్క సారిగా హైలెట్ అవుతాయి. జనం లో వారి విషయం చర్చగా వస్తుంది. అందుకే కేసీయార్ ఇవన్నీ గమనించే తెలంగాణాలో పొలిటికల్ హీట్ పెరగకుండా చూసుకుంటున్నారు అని అంటున్నారు. అధికారం లో ఉన్న బీయారెస్ కనుక ఒక మాట అంటే అది కచ్చితంగా హైలెట్ అయి తీరుతుంది. దానికి కాంగ్రెస్ నుంచి కానీ బీజేపీ నుంచి కానీ కౌంటర్లు వస్తే ఇక రచ్చ మామూలుగా ఉండదు. అలా విపక్షాల కు హైప్ క్రియేట్ అయి వారు రేసులో ముందుకు వస్తున్నారు అన్న ఫీలింగ్ కలుగుతుంది. అందుకే తెలివిగా తెలంగాణా రాజకీయాల ను ఏ మాత్రం కెలకకుండా కేసీయార్ పూర్తిగా

## కాంగ్రెస్ - బిజెపికి చుక్కలు చూపించేస్తారా?

వ్యూహాత్మకమైన మౌనాన్ని పాటిస్తున్నారు అని అంటున్నారు. దీని వల్ల తెలంగాణాలో ప్రతిపక్షాల అలికిడి సహజంగా ఎంతో కొంత తగ్గుతుంది. వారు ఎన్ని విమర్శలు చేసినా కూడా వన్ సైడెడ్ గానే ఉంటాయి. ఒంటి చేతి చప్పట్లుగా మిగిలిపోతాయి. అలా చప్పబడిపోతాయి.చడీ చప్పుడు లేకుండా జనం మైండ్ లోకి రాకుండా ఏమీ కాకుండా అలాగే గాలిలో కలసి ఆవిరై పోతాయి. సరిగ్గా ఇదే ప్లాన్ తో కేసీయార్ సైలెంట్ గా ఉన్నట్లుగా చెబుతున్నారు. అంటే తన మాటల వల్ల విమర్శల వల్ల కూడా ఏ మాత్రం విపక్షాల గ్రాఫ్ పెరగకూడదు వారి ఉనికి అన్నదే పెద్దగా వెలుగులోకి రాకూడదు అనే బ్రహ్మాండమైన ఎత్తుగడలోనే కేసీయార్ కోరి మరీ మౌనాన్ని పాటిస్తున్నారు అని అంటున్నారు. ఇలా చేయడం వల్ల తెలంగాణా రాజకీయాల్లో వేడి పెద్దగా ఉండదు. జనాలలో కూడా మళ్లీ బీయారెస్ అధికారంలోకి వస్తుందన్న భావన మిగిలిపోతుంది. ఇదే జరగాలని ఇలాగే కావాలని కేసీయార్ ఎత్తుగడల లో ఉన్నారని అంటున్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో ఎన్నికల జోరు!

హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గరపడుతోంది. అక్టోబర్/నవంబర్‌లల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. డిసెంబర్ నాటికి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావొచ్చు. ఈ ఎన్నికలను ఎదుర్కొనడానికి అన్ని పార్టీలు కసరత్తు సాగిస్తోన్నాయి. అధికార భారత్ రాష్ట్ర సమితి, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ.. సర్వశక్తులను ఒడ్డుతున్నాయి. తెలంగాణతో పాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని నిలుపుకోవడంతో పాటు మిగిలిన చోట్ల కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ కసరత్తు పూర్తి చేస్తోంది. ఇందులో భాగంగా మిజోరం మిగిలిన నాలుగు రాష్ట్రాలకూ ప్రత్యేకంగా స్టీరింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్. సీనియర్లను బరిలోకి దింపింది. వారికి కీలక బాధ్యతలను అప్పగించింది. టికెట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచార వ్యవహారాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఒక్కో స్టీరింగ్ కమిటీలో అయిదు నుంచి ఎనిమిది మందిని సభ్యులుగా నియమించింది. తెలంగాణలో ఏర్పాటైన స్టీరింగ్ కమిటీకి పార్టీ సీనియర్ నేత కే మురళీధరన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. బాబా సిద్ధిక్, జిగ్నేష్ మేవాణీ ఇందులో సభ్యులు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధినేత రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, లోక్‌సభ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఈ కమిటీకి ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులయ్యారు. ఏఐసీసీ కార్యదర్శులందరికీ



చోటు కల్పించింది. రాజస్థాన్ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్‌గా గౌరవ్ గొగొయ్, మధ్యప్రదేశ్‌- జితేంద్ర సింగ్, ఛత్తీస్‌గఢ్‌- అజయ్ మాకెన్ అపాయింట్ అయ్యారు. ఆయా రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నేతలను సభ్యులుగా, ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన జారీ చేశారు.

## బీజేపీలోకి వెళ్లావ్.. కంపెనీ మూతపడిందంటూ అసెంబ్లీలో ఈటలపై కేటీఆర్ సెటైర్లు..




హైదరాబాద్ : అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగంది. ఐటీ ఎగుమతులపై ప్రశ్నకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా సభలో కేటీఆర్ మాట్లాడుతూ... బయట ఈ కుంభకోణం ఆ కుంభకోణం అంటూ కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. ఈ రోజు ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు రికార్డు స్థాయిలో పెరిగిందంటే ఆషామాషీ కాదన్నారు. స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్ షిప్ ఉండటం వల్లే ఇది సాధ్యం అయిందన్నారు. తెలంగాణలో కులమత పంచాయితీలు లేవన్నారు. ఇంకా కేటీఆర్ మాట్లాడుతూ.. "ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన రజినీకాంత్ తాను న్యూయార్క్‌లో ఉన్నానా? హైదరాబాద్‌లో ఉన్నానో తెలియడం లేదన్నారు. సూపర్ స్టార్ రజినీ కాంత్‌కు తెలంగాణ అభివృద్ధి కనిపిస్తోంది కానీ ప్రతిపక్ష నేతలకు కనిపించటం లేదు. ప్రతిపక్ష నేతలు కంటి వెలుగులో చూపించుకుంటే మంచిది" అన్నారు. ఇక సభలో ఈటల రాజేందర్‌పై కేటీఆర్ సెటైర్లు వేశారు. రాజేందర్ మంత్రిగా ఉన్నప్పుడు హుజూరాబాద్‌లో ఐటీ కంపెనీ ఉండేదని.. ఇప్పుడు ఉందో లేదో తెలియదన్నారు. దీనికి ఈటల లేదని సమాధానం చెప్పారు. 'నువ్వు బీజేపీలోకి వెళ్ళావు.. ఐటీ కంపెనీ మూతపడింది' అంటూ సెటైర్ వేశారు.




# రాహువు వీడిన రాహుల్..

## ఎంపీగా కొనసాగొచ్చు.. పోటీ చేయొచ్చు

దేశంలో కాంగ్రెస్ కు నూకలు ఎప్పటికీ ఉంటాయి. 20 ఏళ్లు అధికారానికి దూరమైనా ఆ పార్టీ మళ్లీ గెలుస్తుంది. ఇప్పుడు చూడబోతుంటే పదేళ్ల తర్వాత కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చేలా కనిపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పట్టిన రాహువు వీడింది. భారత్ జోడో యాత్రతో జనంలోకి వెళ్లిన ఆయన ఇమేజ్ ను దెబ్బతీసే ప్రయత్నానికి సుప్రీం కోర్టు చెక్ పెట్టింది. కాగా, సుప్రీం కోర్టు తాజా తీర్పుతో రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం కొనసాగనుంది. ఆయన ఎన్నికల్లో పోటీ చేసేందుకూ అవకాశం చిక్కనుంది. మోదీ ఇంటి పేరుపై విమర్శలకు గాను గుజరాత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడంతో.. రాహుల్ ను ఎంపీగా అనర్హుడిగా ప్రకటిస్తూ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే, రాహుల్ కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఆయనకు పడిన రెండేళ్ల శిక్షపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 'ఈ కేసులో గరిష్ఠ శిక్ష విధించేందుకు ట్రయల్ జడ్జి ఎటువంటి కారణం చెప్పలేదు. ఈ క్రమంలో దోషిగా నిర్ధారించే తీర్పును నిలిపేయాలి. ఈ తరహా వ్యాఖ్యలు మంచివి కావన్న విషయంలో సందేహమే లేదు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి బహిరంగ ప్రసంగాలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అందరూ ఆశిస్తారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మోదీ ఇంటి పేరుపై రాహుల్ వ్యాఖ్యలు చేసినది 2019లో అయితే.. 2023లో తీర్పు వచ్చింది.

**తీర్పు ఆధారంతో వేటు..** గుజరాత్ కోర్టు తీర్పు ఆధారంగా.. రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దుచేశారు. రాహుల్ పై గుజరాత్ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ పరువు నష్టం దావా వేశారు. దీంతో సూరత్ కోర్టు ఆయనకు రెండేళ్ల శిక్ష విధించింది. ఫలితంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద అనర్హత వేటు పడింది. అలా లోక్ సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఈ క్రమంలోనే శిక్షపై స్టే విధించాలని కోరుతూ వేసిన పిటిషన్ ను గుజరాత్ హైకోర్టు కొట్టేయగా.. దీన్ని సవాలు చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దానిమీద చారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం.. రెండేళ్ల శిక్షపై తాజాగా స్టే విధించింది.

**కొత్త పార్లమెంటులో సగర్వంగా సభకు..** ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. కొత్తగా ప్రారంభించిన భవనం ఇందుకు వేదికైంది. రాహుల్ పై అనర్హత వేటు పడిన తర్వాత జరుగుతున్న సమావేశాలు ఇవే. మోదీలపై వ్యాఖ్యలు విమర్శలు మాత్రమేనని.. తన తప్పేమీ లేదంటూ రాహుల్ వాదిస్తున్నారు. బుధవారం కూడా సుప్రీం కోర్టును తనపై విధించిన నిషేధాన్ని తొలగించాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలకు అనుమతించాలని విన్నవించారు. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పుతో ఆయన సగర్వంగా కొత్త పార్లమెంటు భవనంలో సమావేశాలకు వెళ్లనున్నారు. 2024 లో జరిగే లోక్ సభ ఎన్నికల్లోనూ పోటీ చేయనున్నారు. కాగా, రాహుల్ పై వేటుతో వాయనాడ్ స్థానం ఖాళీగా ఉన్నట్లు ప్రకటించారు. అక్కడ ఉప ఎన్నిక అయితే జరపడం లేదు. మరిప్పుడు ఏం చేస్తారో? మరోవైపు రాహుల్ సభ్యత్వంపై సుప్రీం కోర్టు తీర్పుతో కాంగ్రెస్ నాయకులు లోక్ సభ స్పీకర్ ను కలిశారు. తమ నాయకుడి సభ్యతవ్ విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**మోదీ రానిస్తారా? :** పైకి చెప్పకున్నా.. రాహుల్ పై అనర్హత ప్రధాని మోదీ వ్యక్తిగత కక్షతో చేసినట్లుగా కనిపించింది. ఇప్పుడు రాహుల్ సభ్యత్వం పునరుద్ధరణకు నోచడంతో మోదీ ఏం చేస్తారో చూడాలి. పార్లమెంటు సమావేశాలు ఈ నెల 11 వరకు జరగనున్నాయి. ఇప్పటికే మణిపూర్ ఉదంతంపై ప్రతిపక్షాల పట్టుతో ఉభయ సభలు సజావుగా సాగడం లేదు. ఇంతలో ఢిల్లీ బిల్లు లొల్లి. వీటి మధ్యలో ప్రతిపక్షాలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. ఇవన్నీ చూస్తే.. రాహుల్ ను మోదీ పార్లమెంటు రానిస్తారా? అంటే చెప్పలేం. ఒకవేళ రాహుల్ పార్లమెంటులో అడుగుపెడితే అది ప్రతిపక్ష ఇండియా కూటమికి నైతికంగా పెద్ద విజయమే. కాబట్టి రాహుల్ సభ్యత్వంపై స్పీకర్ నిర్ణయాన్ని ప్రభుత్వం కొంత ఆలస్యం చేసే అవకాశం ఉంది. అయితే, శీతాకాల సమావేశాలకైనా అనుమతించక తప్పదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**'నా కర్తవ్యం అదే..': సుప్రీం తీర్పుపై రాహుల్ ట్వీట్** 'మోదీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యలకు గానూ నమోదైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఈ కేసులో ఆయనకు పడిన రెండేళ్ల జైలు శిక్షపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీనిపై రాహుల్ ట్విటర్ వేదికగా స్పందించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎలాంటి పరిణామాలు ఎదురైనా తనను ఎవరూ ఆపలేరని అన్నారు. "ఏది జరిగినా నా కర్తవ్యం మాత్రం ఒకేలా ఉంటుంది. దేశ సిద్ధాంతాలు, ప్రజల ప్రయోజనాలను రక్షించడమే నా బాధ్యత" అని రాహుల్ తన ట్విటర్‌లో రాసుకొచ్చారు. అటు రాహుల్ జైలు శిక్షను నిలిపివేయడంపై విపక్షాల కూటమి 'ఇండియా'లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. నిజమే గెలుస్తుందని, తమ పోరాటానికి విజయం లభించిందని పలువురు విపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు.

**రెండేళ్ల శిక్షపై సుప్రీం స్టే.. పార్లమెంట్‌లో రాహుల్ అడుగుపెట్టేనా?**
**– ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి రాహుల్..**

సుప్రీం తీర్పు నేపథ్యంలో దిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. తీర్పు వెలువడిన కొద్ది గంటలకు రాహుల్ గాంధీ కూడా పార్టీ ఆఫీసుకు వచ్చారు. దీంతో ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి ఆయన తమిళనాడు కాంగ్రెస్ నేతలతో సమావేశంలో పాల్గొన్నారు. పరువునష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. రెండేళ్ల జైలు శిక్ష విధించడానికి సరైన కారణాలు చెప్పలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అదే సమయంలో రాహుల్ వ్యాఖ్యలపైనా అభ్యంతరం తెలిపింది. ఆయన చేసిన వ్యాఖ్యలు అంతగా రుచించవని, ప్రజాజీవితంలో కొనసాగేవారు మరింత జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలని హితవు పలికింది.

## సంపాదకీయం

# ఆప్ ఎంత ఆప సోపాలు పడినా మోడీదే గెలుపు...?

ఆప్ ది పదేళ్ళ రాజకీయ అనుభవం. కానీ నాలుగున్నర దశాబ్దాల పార్టీ అయిన బీజేపీని సవాల్ చేస్తోంది. మోడీ సర్కార్ కే చుక్కలు చూపిస్తోంది. ఢిల్లీలో బీజేపీకి ఉన్న పట్టుని తీసి గట్టు మీద పెట్టిన ఆప్ స్ట్రాంగ్ అయింది. అందుకే ఆప్ అధికారాలకు కత్తెర వేయడానికి ఢిల్లీ సర్వీసుల బిల్లు పేరుతో బిల్లుని రెడీ చేసి మోడీ ప్రభుత్వం పార్లమెంట్ లో పెట్టింది. ఈ బిల్లుని నెగ్గించుకోవడం ద్వారా ఆప్ ని దారుణంగా దెబ్బ తీయాలన్నదే బీజేపీ అజెండా. ఇక బీజేపీకి లోక్ సభలో పూర్తి మెజారిటీ ఉంది. బిల్లు సునాయాసంగా నెగ్గుతుంది. కానీ రాజ్యసభలో మాత్రం ఇబ్బందులు ఉన్నాయి. దాంతో అక్కడ కూడా మెజారిటీని కూడగట్టే పనిలో బీజేపీ ఉంది. బీజేపీ సామర్థ్యాన్ని పసిగట్టిన ఆప్ విపక్ష కూటమికి ముందే షరతులు పెట్టి మరీ అందులో చేరింది. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కోత వేసే కేంద్రం బిల్లునకు మద్దతు ఇవ్వవద్దు అంటూ అన్ని విపక్ష పార్టీలను వేడుకుంది. అయితే ఏపీలోని వైసీపీని ఆప్ మద్దతు అడగలేదు. అడిగినా ఏమి జరిగేదో కానీ ఇపుడు కేంద్రం ప్రవేశ పెట్టే ఈ బిల్లుకు వైసీపీ జై కొడుతోంది. ఆ పార్టీకి రాజ్యసభలో తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు. ఇది బీజేపీకి ప్రాణప్రదమైన మద్దతుగా ఉంటుంది. ఇక బీజేపీకి ఇంకా మరో కీలకమైన మద్దతు ఒడిషాలోని బిజూ జనతాదళ్ నుంచి దక్కింది. ఆ పార్టీకి కూడా రాజ్యసభలో తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు. అంటే ఈ రెండు పార్టీల మద్దతు కలసి 18 మంది ఎంపీలు అయ్యారన్న మాట. అదే విధంగా పెద్దల సభలో బీజేపీకి సొంతంగా 90 మంది ఎంపీలు ఉంటే ఎన్డీయేతో కలుపుకుని 103 మంది ఉన్నారు రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 245 గా ఉంది. అందులో ఏడు ఖాళీలను తీసేస్తే 238 మంది నంబర్ గా ఉంది. ఇందులో సగానికి ఒక ఓటు అదనం అంటే 120 మంది మద్దతు ఉండాలి. ఇపుడు చూస్తే బీజేపీకి వైసీపీ బిజూ జనతాదళ్ తో కలుపుకుని 121 మంది మద్దతు లభించింది. ఒకే ఒక్క టీడీపీ ఎంపీ మద్దతు కూడా ఆ పార్టీదే అంటున్నారు. దీంతో పాటు అయిదుగురు నామినేటెడ్ సభ్యుల మద్దతు కూడా బీజేపీకి ఉంది. ఇలా లెక్క వేసుకుంటే 127 ఓట్ల మద్దతుతో ఆప్ మీద పెట్టిన ఢిల్లీ సర్వీసుల బిల్లుని బీజేపీ సునాయాసంగా గెలుచుకుంటుంది. ఈ బిల్లు చట్టం అయితే కనుక ఆప్ కేవలం నామమాత్రపు ప్రభుత్వంగా మిగులుతుంది. ఏ విషయం మీద అయినా తుది నిర్ణయం తీసుకునే సర్వాధికారం లెఫ్టినెంట్ గవర్నర్ కి దఖలు పడుతుంది. ఇండియా కూటమి కట్టాక కూడా మోడీ పార్లమెంట్ లో గెలిస్తే మాత్రం అది విపక్షాలకు పెను సవాలే అని అంటున్నారు. మరి ఆప్ ఆపసోపాలకు బీజేపీ మార్క్ ట్రీట్మెంట్ ఇది అని కమలనాధుల నుంచి వినిపిస్తున్న మాటగా ఉంది

# పార్కులపై పర్యవేక్షణ కరవు



వరంగల్ : నగరంలో పార్కులపై పర్యవేక్షణ కరువైంది. గ్రేటర్ ఉద్యానం, ఇంజినీరింగ్ విభాగాల సమన్వయ లోపంతో పాడైన ఆట వస్తువుల మరమ్మతులు చేయడం లేదు. బల్దియా గ్రీన్ పద్దు(బడ్జెటు), పట్టణ ప్రగతి ద్వారా లక్షలు ఖర్చు పెట్టి కాలనీల్లో పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. ప్రారంభించిన తర్వాత అధికారులు పర్యవేక్షించడం లేదు. స్వయం సహాయక సంఘాలు, ఇతరులకు అప్పగించి వదిలేస్తున్నారు. పచ్చదనం, మొక్కలకు నీళ్లు పట్టడం, పిల్లల ఆట వస్తువులు, వీధి దీపాలు, తాగునీటి వసతి తదితర పనులు సక్రమంగా జరగడం లేదు. వేసవి సెలవులొచ్చాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు పార్కులకెళ్తున్నారు. అరకొర వసతులు, ఆట వస్తువులు సరిగా లేకపోవడంలో నిరాశ చెందుతున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పార్కులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. పార్కుల వివరాలు: కాశీబుగ్గ సిద్ధయ్య హొటల్, కాశీబుగ్గ ఏకలవ్య పార్కు, ఎల్బీనగర్, ఎస్సార్టీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, టెలికం కాలనీ, ఎంహెచ్‌నగర్ చిట్టి పార్కు, క్రిస్టియన్ కాలనీ, తిమ్మాపూర్ ఫ్రీడమ్ పార్కు, వనితా వనం, కరీమాబాద్ గుండుబావి, ఉర్సు సుభాష్‌నగర్

దేశాయిపేట ఎంహెచ్‌నగర్ పార్కులో నీళ్ల ట్యాంకు మూత తెరచి ఉంచారు. ఆట వస్తువుల వద్ద ఇసుక లేదు. తాగునీళ్ల కోసం పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

వరంగల్ క్రిస్టియన్ కాలనీ పిల్లల పార్కులో ఆట వస్తువుల నిర్వహణ సరిగా లేదు. ఇసుక నింపడం లేదు.

కాశీబుగ్గ సిద్దయ్య హొటల్ పార్కులో ఆట వస్తువులు పాడైపోయాయి. తాగునీళ్ల కోసం అల్లాడుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదు.

కరీమాబాద్ గుండుబావి పార్కులో సమయ పాలన లేదు. రెండు గేట్లు మూసేసి ఉన్నాయి. పిల్లలకు తాళాలు ఇచ్చారు. తాగునీళ్లు లేవు. ఆట వస్తువులు తక్కువగా ఉన్నాయి.

42వ డివిజన్ ఉర్సు సుభాష్‌నగర్ పార్కులో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆట వస్తువులు అందుబాటులోకి రాలేదు. పచ్చదనం కరువైంది. మొక్కలకు నీళ్లు పట్టడం లేదు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు వెలగడం లేదు. పార్కు పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారో తెలియదని స్థానికులు చెబుతున్నారు.

**నిధులున్నా.. నిర్లక్ష్యమే**

కొత్త పురపాలక చట్టంతో ప్రతి మున్సిపాలిటీలో వార్షిక సొంత ఆదాయంలో పదిశాతం నిధులు గ్రీన్ పద్దుకు కేటాయిస్తున్నారు. గ్రేటర్ వరంగల్‌లో ఏటా రూ.20 కోట్లకుపైగానే కేటాయిస్తున్నారు. నిధులున్నా పార్కులు అభివృద్ధిలో అధికారులు అశ్రద్ధ కనిపిస్తుంది. నగరంలోని 66 డివిజన్లలో మొత్తం 47 పార్కులున్నాయి.

**ఆట వస్తువులు బాగు చేస్తాం**

సీహెచ్.శ్రీనివాస్‌రావు, ముఖ్య ఉద్యాన అధికారి, గ్రేటర్ వరంగల్

పిల్లల ఆట వస్తువులు బాగు చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా పార్కులు ఉదయం, సాయంత్రం తెరవాలి. తాగునీటి వసతి గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

# క్రమబద్ధీకరణ దరఖాస్తులు 1.13 లక్షలు

కరీంనగర్ : అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న వారికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఉమ్మడి జిల్లాలో..రెండు నగరపాలికలు, 14 మున్సిపాలిటీలు, శాతావాహన పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్-2020 దరఖాస్తుల పరిశీలన మొదలైంది. అక్టోబర్ 31, 2020 వరకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేశారు. దాంతో నగర, పురపాలికల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నాలుగు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో దాదాపు 1.13 లక్షల దరఖాస్తులు రాగా అప్పటి నుంచి అలాగే పెండింగ్‌లో ఉన్నాయి.

**రసీదు, డాక్యుమెంట్లతో..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించిన రసీదుతో పాటు ఆగస్టు 26, 2020లోపు రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల ఆధారంగా క్రమబద్ధీకరిస్తారు. అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా ఫీజు మదింపు చేస్తారు. దీనికి ఈసీ కూడా అవసరముంది. 30 ఫీట్ల రహదారి కచ్చితంగా ఉండాలి. లేదంటే మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేయాల్సి ఉంటుంది. ఫీజు మొత్తం చెల్లించిన తర్వాత ఉత్తర్వులు ఆన్‌లైన్‌లోనే తీసుకునే వీలుంది. కరీంనగర్ నగరపాలక పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు ఉండటంతో వీటిని త్వరగా పరిష్కరించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా హెల్ప్ డెస్క్



ఏర్పాటు చేస్తున్నారు.

**ప్రక్రియ వేగవంతానికి చర్యలు**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ఉమ్మడి జిల్లాకు ఒక సబ్ నోడల్ అధికారిని నియమించింది. మున్సిపాలిటీల్లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలన, అనుమతులు జారీ చేసే బాధ్యతలు అప్పగించింది. సవ్యంగా ఉన్న దరఖాస్తులకే ఆమోదం పలికే అవకాశముంటుంది. ప్రక్రియ ప్రారంభం చేయడంతోనే ఆయా దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తాజా క్రమబద్ధీకరణ ద్వారా నగర, పురపాలికలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది.

ఇప్పటికే భవనాలు నిర్మించుకుంటే..ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసి భవన నిర్మాణం చేసుకోవడానికి అనుమతులు తీసుకున్న వారికి క్రమబద్ధీకరణ అవసరం లేదు. భవన నిర్మాణ సమయంలోనే ఎల్ఆర్ఎస్ మొత్తాన్ని చెల్లించడంతో తిరిగి క్రమబద్ధీకరణ కోసం రానవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమున్న దరఖాస్తుల్లో ఇంటి అనుమతులు తీసుకున్నవే ఉన్నట్లు సమాచారం.

# ప్రమాదాల 'విస్తరణ'..



వరంగల్ : జాతీయ రహదారి(163)పై సర్వీస్ రోడ్లు, సైడ్ రెయిలింగ్ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అధిక ఖర్చుతో కూడిన పనులు చేసి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2015లో రూ.1,920 కోట్లతో యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. 2016లో జూన్ 1న అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా అరెపల్లి వరకు 99.10 కి.మీ మార్గాన్ని 30 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. గడువు పూర్తయి మూడేళ్లు కావస్తున్నా నేటికీ అనేక చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

**చేయాల్సిన పనులివీ..** రహదారి విస్తరణ పనులలో భాగంగా గ్రామాలు ఉన్నచోట ప్రజల సౌకర్యార్థం సర్వీస్ రోడ్లు వేయాలి. జాతీయ రహదారిపై నేరుగా ప్రజలు రాకుండా రాకుండా మధ్యలో ఇనుప కంచెతో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. రహదారి పొడవునా హైమాస్ట్ దీపాలు, ప్రతి గ్రామంలో మినీ బస్ స్టేజీ నిర్మించాలి. గృహాల్లోకి వర్షం, డ్రైనేజీ నీళ్లు రాకుండా చర్యలు చేపట్టాలి.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌లో రహదారికిరువైపులా సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కంకర పోసి వదిలేశారు. గ్రామంలో 800 మీటర్ల పొడవునా గృహాలు ఉండడంతో సర్వీస్ రోడ్డు లేక ప్రజలు నేరుగా ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గృహాలు ఉన్నచోట విస్తరణ పనులకుగాను 75 ఫీట్ల వెడల్పు తీయగా.. రాఘవపూర్‌లో మాత్రం 100 ఫీట్లు తీశారు. 'ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే దారిలో సర్వీస్ రోడ్డు నిరుపయోగంగా మారింది. బస్టాండ్ నుంచి శ్రీవాణి గురుకులం వరకు సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం విద్యుత్ కేంద్రం వరకే వేసి వదిలేశారు. చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల వద్ద సర్వీసు రోడ్డు వేసినప్పటికీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయలేదు. ప్రజలు ఎండలో నిల్చొని వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డు పక్కన డ్రైనేజీ పూర్తికాకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరుతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది.

**హైమాస్ట్ దీపాలేవీ?**

ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద సర్వీస్ రోడ్డు వేసినప్పటికీ కొంతమేర హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయలేదు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

కొత్తురి హనుమంత్, రాఘవపూర్

**నిత్యం భయాందోళన**

రాఘవపూర్ గ్రామంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయకుండా వదిలేశారు. రహదారి దాటుతున్న క్రమంలో భయాందోళనకు గురవుతున్నాం. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించాలి. అధికారులు స్పందించాలి

మునిగెల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి

# అడుగు.. ప్రగతి వైపు

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి ఆలయ పునర్‌నిర్మాణ ప్రాజెక్టు ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. యాదాద్రి ఆలయ ప్రాధికార సంస్థ (వైటీడీఏ (యాడా))ను మరింత విస్తరించి ఆలయ ఆదాయాన్ని పెంచే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో హైదరాబాద్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. గతంతో పోలిస్తే ఇప్పటికే దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగినా..భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆదాయ పరంగా క్షేత్రానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా యాడా పరిధిని విస్తరించాలని నిర్ణయించారు. క్షేత్రంలో పనుల పరిశీలనతో పాటూ ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలనే తలంపుతో సీఎం కేసీఆర్ ఛైర్మన్‌గా, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి కిషన్‌రావు వైస్ ఛైర్మన్‌గా 2015 ఫిబ్రవరి 27న ప్రభుత్వం యాడాను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం యాడా పరిధిలో యాదగిరిపల్లి, సైదాపూర్, మల్లాపూర్, దాతర్‌పల్లి, గుండ్లపల్లి, రాయిగిరి, బస్వాపురం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, నిర్మాణాలకు యాడానే అధికారికంగా అనుమతులు మంజూరు చేస్తోంది. వివిధ



రూపాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటూ సమీపంలోని మరిన్ని గ్రామాలను యాడా పరిధిలో విలీనం చేస్తే ఆలయానికి ఆదాయ పరంగా ఎలాంటి ఢోకా ఉండదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు త్వరలోనే విలీనం చేసే ప్రతిపాదనలున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. మరోవైపు ఈ గ్రామాల్లో ఇప్పటికే మూడు, నాలుగు సార్లు ప్రభుత్వ ప్రాజెక్టులకు భూ సేకరణ జరిగిన దృష్ట్యా విలీన ప్రక్రియకు ఆటంకాలు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**ఎటూ తేలని ఆలయనగరి**

ఆలయనగరిలో భక్తుల బస కోసం నిర్మించే కాటేజీల అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దాతలు ఎవరైనా రూ.కోటి ఇస్తే వారి పేరుతో విల్లా ఆకృతిలో కాటేజీల నిర్మాణం సాగుతోందని అధికారులు వెల్లడించినా.. ఉన్నతస్థాయిలో ఓ నిర్ణయం రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. భక్తుల బస కోసం ప్రస్తుతం క్షేత్రంలో సరిపడినన్ని కాటేజీలు లేక పోవడంతో భక్తులు ఎక్కువ ధరకు అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇప్పటికైనా దీనిపై ఓ నిర్ణయం తీసుకొని కాటేజీల నిర్మాణం ప్రారంభిస్తే బస ఇబ్బందులు తప్పుతాయని భక్తులు కోరుతున్నారు.

# మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో..!


ములుగు : జిల్లా కేంద్రంలోనే క్రీడామైదానం లేదంటే అతిశయోక్తి కాదు. విద్యార్థులు, యువకులు ఆడుకోవడానికి అవకాశమే లేకుండా పోతోంది. క్రీడా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి దూర ప్రాంతాలకు వెళ్లి మైదానాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ములుగు పట్టణానికి చివర బండారుపల్లి రోడ్డులో ఓ ప్రైవేటు వ్యక్తి స్థలంలో క్రికెట్ ఆడుతున్నారంటే ఆశ్చర్యం కలగమానదు. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, షటిల్, ఖోఖో లాంటి తదితర క్రీడలు ఆడుకునే అవకాశమే లేదు. క్రీడా పరికరాలే తెలియవు. మినీ స్టేడియం పనులు మధ్యలో నిలిచిపోయాయి.

**జాకారం మైదానమే దిక్కు**

జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానమే జిల్లాకు పెద్ద దిక్కుగా ఉంది. ఎలాంటి క్రీడలు ఆడాలన్నా అక్కడికి వెళ్లాల్సిందే. అది చాలా దూరం కావడంతో తప్పని సరి పరిస్థితుల్లో స్కూలు గేమ్స్ నిర్వహించడం తప్ప ఇతర క్రీడాకారులు, యువకులు అక్కడకు వెళ్లలేక పోతున్నారు. ఒక వేళ ఎవరైనా అక్కడికి వెళ్లినా క్రీడా పరికరాలు అందుబాటులో ఉండవు. దీంతో పట్టణ ప్రజలు క్రీడలకు చాలా దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

**నిర్మాణంలో జాప్యం**

ములుగులో మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టారు. కాని అనుకున్నంత వేగంగా పనులు జరగడం లేదు. చేసిన పనికి బిల్లులు చెల్లించడం లేదని మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు



పనులు నిలిపివేశారు. స్థల సేకరణ చేయకుండానే 2014లో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.60 కోట్లు మంజూరు చేసింది. స్థల సేకరణకే దాదాపు 8ఏళ్లు పట్టింది. అనేక ఆటంకాలను అధిగమించి ఎట్టకేలకు బండారుపల్లి సమీపంలో సుమారు 6 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీంతో పనులు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొద్ది రోజులు పనులు వేగంగా జరిగినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపి వేసి వెళ్లిపోయారు. మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే వివిధ రకాల క్రీడలు ఆడుకునేందుకు జిల్లా కేంద్రానికి చెందిన యువత, విద్యార్థులకు అవకాశం కలుగుతుంది. క్రీడా సామాగ్రి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి స్టేడియం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

# నిధులు వస్తేనే రోడ్లు బాగు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో వారం పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పెద్దఎత్తున రహదారులు దెబ్బతిన్నాయి. మూడేళ్లుగా జూన్ నుంచి ఆగస్టు వరకు అతి భారీ వర్షాలు కురియటం.. రహదారులు దెబ్బతింటుండడం జరుగుతోంది. ఈ సారి అతిభారీ వర్షాలతో భారీగా నష్టం వాటిల్లింది. జిల్లాలో అత్యధికంగా జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, మేడిపల్లి మండలాల్లో రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో రహదారుల భవనాలకు సంబంధించి 11 మైనర్, 18 ప్రాంతాల్లో మేజర్‌గా రహదారులు దెబ్బతిన్నాయి. వీటి పూర్తి మరమ్మతు కోసం రూ.25 కోట్ల నిధులు అవసరం కాగా తాత్కాలిక మరమ్మతు కోసం రూ.1.71 లక్షలు అవసరం అవుతాయని అధికారులు తెలిపారు. పంచాయతీ రాజ్‌శాఖ రహదారుల్లో 16 మైనర్‌గా దెబ్బతినగా 27 ప్రాంతాల్లో భారీగా దెబ్బతిన్నాయి. పూర్తిగా బాగు చేసేందుకు ఆ శాఖకు రూ.44 కోట్లు అవసరం అవుతాయని గుర్తించారు. అన్ని రహదారులు పూర్తిగా బాగు చేయాలంటే రూ.70 కోట్లు అవసరం అవుతాయి. తాత్కాలికంగా రూ.4 కోట్లతో పూర్తి చేయవచ్చు.

వంతెనలపై నిర్లక్ష్యమేనా..?

జగిత్యాల గ్రామీణ మండలం అనంతారం జాతీయ రహదారిపై నిర్మించిన అనంతారం వంతెనపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దాదాపు 65 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన అప్పటి అవసరాలకు అనుకుగుణంగా లోలెవల్ వంతెన నిర్మించారు. జాతీయ రహదారి కావటంతో ధర్మపురి, మంచిర్యాల, లక్షెట్టిపేట వైపు నిత్యం వేలాది వాహనాలు, భారీ లారీలు వెళ్తుంటాయి. ఈ వంతెన లో లెవల్ వంతెన కావటంతో ఏటా అధిక వర్షాలు కురిసినప్పుడు మునిగిపోవటం, ఆ తర్వాత అధికారులు వంతెన నిర్మాణం సంగతి మర్చిపోవటం పరిపాటిగా మారిపోయింది. అయిదేళ్లుగా ఏటా వర్షాకాల సీజనల్‌లో



3 నుంచి 4 సార్లు మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి మూడు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 65 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన మొదటిసారి ఒక వైపు కోతకు గురైంది. దీంతో ధర్మపురి, మంచిర్యాల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో జాతీయ రహదారిపై ఉన్న వంతెనలు దాదాపు ఎత్తు వంతెనలు నిర్మించారు. అనంతారం వంతెనను మాత్రమే వదిలిపెట్టడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్కాయిపల్లె కష్టాలు

ధర్మపురి మండలం నేరెళ్ల అక్కాయిపల్లె వద్ద ఉన్న లోలెవల్ వంతెన ఏటా మునిగిపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ ఎతైన వంతెన నిర్మించాలని డిమాండ్ ఉన్న జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవటం లేదు. వాస్తవానికి జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోకుండా అన్ని సక్రమంగా నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ అక్కాయిపల్లె వంతెన, అనంతారం వంతెనలపైనే ఎందుకు దృష్టి సారించటం లేదని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దెబ్బతిన్న వంతెనలతోపాటు.. అనంతారం, అక్కాయిపల్లె వంతెనలు పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

అరకొర నిధులే..జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా రోడ్లు దెబ్బతిన్నాయి. మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలకు రహదారుల మరమ్మతు కోసం రూ.120 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నిధులు పూర్తి స్థాయిలో రాకపోవటంతో గతంలో దెబ్బతిన్న రహదారులనే అలా వదిలేయగా తాజాగా మళ్లీ రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో రహదారులు గుంతలు పడి ఇబ్బందిగా ఉండగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలంటే రూ.150 కోట్లు అవసరం అవుతాయని ఒక అంచన. తాత్కాలిక పనుల కోసం నిధులు మంజూరుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపగా పూర్తి స్థాయిలో మరమ్మతు కోసం ఎప్పుడు విడుదల చేస్తారోనని జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# మైనారిటీలకూ ఆర్థిక సాయం!

రాంపూర్ : బీసీ కుల వృత్తుల మాదిరిగా మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించడంతో అర్హుల్లో ఆశలు మొలకెత్తాయి. క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. మిగిలిన వారిని ఇప్పటికే రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో నుంచి ఎంపిక చేయనున్నారు. పూర్తి స్థాయి విధి విధానాలు ఖరారు కావాల్సి ఉంది.

కొరవడిన స్పష్టత...

లబ్ధిదారుల ఎంపిక విధానంపై స్పష్టమైన ఆదేశాలు ఇంకా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ వద్దకు రాలేదు. ఎంతమందికి ఇస్తారు? ఎంపికలో ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారనే దానిపై సంబంధిత అధికారుల్లో స్పష్టత లేదు. ఈ సాయం కోసం ప్రస్తుతం క్రిస్టియన్ల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల వారు రూ.లక్షలోపు, పట్టణ ప్రాంతాల వారు రూ.2 లక్షలలోపు ఆదాయం కలిగి ఉండాలి. 21 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు వయసు కల్గిన వారు ఆగస్టు 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

రాయితీ రుణాల దరఖాస్తుదారుల నుంచి ఎంపిక

క్రిస్టియన్లు మినహా మిగిలిన మైనారిటీ వర్గాల వారికి స్వయం ఉపాధి పథకం కోసం అందించే రాయితీ రుణాల స్థానంలో రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు సమాచారం. రాయితీ రుణాలకు జిల్లాలో గతేడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరిలో మైనారిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 80 శాతం రాయితీతో రూ.లక్ష రుణం కింద 61 యూనిట్లు, రూ.2 లక్షల రుణం కింద 26 యూనిట్లు జిల్లాకు మంజూరయ్యాయి. జిల్లాలో 6,329 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు రాయితీ రుణాలు అర్హులకు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా మైనారిటీలకు రూ.లక్ష సాయాన్ని అందించేందుకు ముందుకు రావడంతో రాయితీ రుణాలు లేనట్లేనా అనే సందేహంలో మైనారిటీలు ఉన్నారు. రూ.లక్ష ఆర్థిక సాయంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరగనుందని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మధుసూదన్ తెలిపారు.

నియోజకవర్గానికి 120 మంది?

ప్రతి నియోజకవర్గం నుంచి 120 మంది మైనారిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. బీసీ ఆర్థిక సాయానికి లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలను ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్లకు అప్పగించినట్లుగానే.. వారికే ఈ బాధ్యతలు అప్పగిస్తారా? లేదా మైనారిటీ సంక్షేమ శాఖ ఈ ప్రక్రియను పూర్తి చేస్తుందా? అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

# నిర్మాణాలు.. వరదపాలు..!



మహబూబాబాద్ : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఉప్పొంగిన వరదలు ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వాగుల్లో ఎప్పుడూ జల కళ ఉట్టిపడేలా నిర్మించిన చెక్‌డ్యాంలు కోతకు గురయ్యాయి. ఏటా ఆయకట్టు పరిధిలో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరిందించాల్సినవి దెబ్బతినడంతో నీరు నిల్వ ఉండని పరిస్థితికి చేరాయి. పలు చోట్ల రక్షణ గోడలు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు వరదలకు కొట్టుకుపోయే స్థితికి చేరాయి. మళ్లీ భారీ వర్షాలు ఉన్నాయని వాతావారణ నిపుణులు చెబుతున్న నేపథ్యంలో వరదలు వస్తే నీటిపాలు కావాల్సి వస్తుందని ఆయకట్టు రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. తాత్కాలిక మరమ్మతులు చేయడానికి అదును ఉంటే సంబంధిత ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఆ దిశగా పనులు చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని అన్నదాతలు అంటున్నారు.

దెబ్బతిన్న 31 చెక్‌డ్యాంలు

జిల్లాలోని తొర్రూరు, దంతాలపల్లి, కేసముద్రం, పెద్దవంగర, మరిపెడ, చిన్నగూడూరు, డోర్నకల్ మండలాల్లోని మున్నేరు, ఆకేరు, పాలేరు వాగులపై నిర్మించిన వాటిలోని 31 చెక్‌డ్యాంలు వరదలకు దెబ్బతిన్నట్లు జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. దంతాలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోంచి ప్రవహిస్తున్న పాలేరు వాగుపై నిర్మించిన 13 చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. వీటి పరిధిలో 10,093 ఎకరాల ఆయకట్టు ఉంది. తొర్రూరు మండలంలోని ఐదు గ్రామాల పరిధిలోని ఆకేరు వాగుపై, మరొకటి పాలేరు వాగుపై నిర్మించినవి కోతకు గురయ్యాయి. తొర్రూరు మండలం సోమారపుకుంట తండా సమీపంలోని ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఎడమ వైపు బండ్ కొట్టుకుపోవడంతో పాటు చెక్‌డ్యాం గోడ ఒకపక్క ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఇంజినీరింగ్ అధికారులు వాగుల్లోని చెక్‌డ్యాంలకు ఎక్కడెక్కడ ఏవిధమైన నష్టం జరిగిందో గుర్తించి వాటిని బాగు చేసేందుకు కార్యచరణ ప్రణాళికను రూపొందించుకున్నారు. వీటిలో కొన్నింటికి ఇప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేయడానికి సాధ్యపడని పరిస్థితులున్నాయి. అలా బాగు చేసే వీలున్న వాటికి సుమారు రూ. 40 లక్షల వరకు నిధులు అవసరపడుతాయో ప్రణాళికలను రూపొందించారు. కాగా 31 చెక్‌డ్యాంలకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు రూ. 13.51 కోట్లు అవసరపడుతాయని ప్రణాళికను సిద్ధం చేశారు.వరదలతో చెక్‌డ్యాం కూలిపోకుండా ఉండేందుకు ఇరుపక్కల నిర్మించిన బండ్ అదే వరదలకు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన ఈ చెక్‌డ్యాం నర్సింహులపేట మండలం ముంగిమడుగు ఆకేరు వాగుపై నిర్మించింది. ఐదేళ్ల కిందట రూ. 3 కోట్లతో నిర్మించారు. ఇది వరకు ఒకసారి భారీ వరదలకు కూలిపోగా మరో రూ. మూడు కోట్లతో తిరిగి నిర్మించారు. ప్రణాళిక ప్రకారం నిర్మించకపోవడం.. చెక్‌డ్యాం సమీపంలోనే ఇసుక అక్రమార్కులు ఇసుకను తోడడంతో ఇటీవల వర్షాలకు వచ్చిన వరదలకు బండ్ కోతకు గురైంది. మరమ్మతులు చేయకుంటే మళ్లీ కురిసే వానలకు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలోని ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం. దీని పరిధిలో 380 ఎకరాల ఆయకట్టు ఉంది. 2020-21లో రూ.3 కోట్లతో నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వానలకు వచ్చిన వరదలతో చెక్‌డ్యాంనకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు కోతకు గురయ్యాయి. ఇది రెండోసారి. 2021లోనూ భారీ వరదల కారణంగా చెక్‌డ్యాం కూలడంతో పాటు రక్షణ గోడ భారీగా కోతకు గురైంది. అప్పటికప్పుడు దానికి రూ.3 కోట్లతో మరోసారి కూలిన ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మాణం చేయడంతో పాటు రక్షణ గోడలను కట్టారు. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు..శాశ్వత పనులకు రూ.30 లక్షలు అవసరపడుతాయని ఇంజినీరింగ్ అధికారులు అంచనాలను రూపొందించారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్లనే రూ.కోట్ల వెచ్చించిన చెక్‌డ్యాం కూలుతుందని.. ఇప్పటికైనా అధికారులు ఇసుక తవ్వకాలను నిలిపివేస్తే ఎలాంటి ప్రమాదం జరగదని..దాంతో ఆయకట్టు పరిధిలో రెండు పంటలు పుష్కలంగా పడుతాయని అన్నదాతలు అంటున్నారు.

దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల పరిధిలోని పాలేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఇది. దీని పరిధిలో 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాల నుంచి వచ్చిన వరదపాటుతో పాటు వాగు ఉప్పొంగడంతో ఎడమ వైపు కట్ట సుమారు 600 మీటర్ల వరకు కోతకు గురైంది. ప్రస్తుతం ఆప్రాంతంలో మరమ్మతులు చేయడానికి వీలులేదు. మరోసారి వరదలు వస్తే చెక్‌డ్యాం కూలిపోతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయంటున్నారు. ఇంజనీరింగ్ అధికారులు శాశ్వత పనులు చేసేందుకు రూ.45 లక్షలు ఖర్చు అవుతాయని అంచనాలు వేశారు.

# ఉద్యాన విద్యకు బాటలు..!




మానుకోట: గత 36 ఏళ్లుగా తెలంగాణలో ప్రధాన ఉద్యాన పరిశోధనా స్థానంగా ప్రసిద్ధి పొందిన మల్యాలలోని జన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధనా కేంద్రం (జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్) ఇక నూతన ప్రస్థానానికి శ్రీకారం చుట్టనుంది. ఈ పరిశోధనా స్థానంలో ఉద్యాన డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరంలోనే ప్రవేశాలను నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటివరకు ఉద్యాన పంటల పరిశోధనతో అన్నదాతలకు వ్యవసాయ సేవలను అందించిన ఈ పరిశోధనా స్థానం ఇకపై ఉద్యాన విద్యను అందించడంలో విద్యార్థులకు వరం కానుంది.

పంటలపై పరిశోధనలు

మల్యాల గ్రామానికి చెందిన ఉమ్మడి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి జన్నారెడ్డి రఘోత్తంరెడ్డి తన 160 ఎకరాల వ్యవసాయ భూమిని ఇక్కడ ఉద్యాన పరిశోధనా కేంద్ర ఏర్పాటుకు విరాళంగా ఇచ్చారు. 1989లో ఇది ప్రారంభంకాగా 1991లో కేవీకేను కూడా నెలకొల్పారు. ఇక విశాలమైన తోటలతో 110 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్‌లో మిరప, పాప్రికా, ఉల్లి, పసుపు, టమాట, మామిడి, సపోటా, జామ, కరోండా తదితర పంటలపై ఇక్కడి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడులను ఇచ్చే ఆయా పంటల రకాలను పరిచయం చేసి, వాటిని సాగు చేసి ఆదాయాన్ని పొందేలా ప్రోత్సహిస్తున్నారు. నశించి పోతున్న మామిడి చెట్లను పునరుద్ధరించే ప్రక్రియను చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తుండడం ఓ విశేషం. ఈ ప్రాంతానికి ఏ రకం పనస సాగుకు అనువుగా ఉంటుందో పరిశోధన చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన చపాటా మిర్చి రకానికి భౌగోళిక గుర్తింపు తీసుకువచ్చేందుకు ఈ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఎంఐడీహెచ్ కార్యక్రమం ద్వారా కొత్తిమీర, వెల్లుల్లి, మెంతుల విత్తనాల ఉత్పత్తిని చేపట్టారు.

60 మందికి అవకాశం

శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) అనుబంధంగా డిగ్రీ స్థాయిలో ఇక్కడ ఏర్పాటు కానున్న ఉద్యాన కళాశాల వల్ల భవిష్యత్తులో ఏటా కనీసం 60 మందికి బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ నాలుగేళ్ల కోర్సులో గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల వారికి ఇది వరంగా మారనుంది.

నిర్వహణకు రూ.166 కోట్లు నిధుల అంచనా..

నూతన ఉద్యాన కళాశాల ఏర్పాటు చేస్తే ఐదేళ్ల పాటు దాని నిర్వహణకు రూ.166.07 కోట్లు అవసరమని ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ అధికారులు బడ్జెట్ అంచనా వేశారు. బోధన, బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలల ఏర్పాటుకు నిధులు అవసరమవుతాయి. కళాశాలకు 58 మంది బోధనా సిబ్బందిలో ప్రొఫెసర్లు 8 మంది, అసోసియేటెడ్ ప్రొఫెసర్లు 16, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 33, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఒకరు అవసరం.వివిధ కేటగిరీల్లో బోధనేతర సిబ్బంది 177 మంది అవసరమవుతారని అంచనా వేశారు.

ఈ విద్యా సంవత్సరంలోనే..?

మల్యాలలో ఉద్యాన కళాశాలను ఈ విద్యా సంవత్సరంలోనే (2023-24)లోనే ప్రారంభిస్తారని అనుకుంటున్నారు. బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్‌లో ప్రవేశాలు ఈ సంవత్సరం నిర్వహించిన టీఎస్ఎంసెట్-2023 ద్వారానే జరుగుతాయి. ఈ విద్యాసంవత్సర ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రకియ పూర్తి కాలేదని అందువల్ల ప్రవేశాలు కోరేవారు ఆప్షన్ పెట్టుకోడానికి రాష్ట్రంలోని ఉద్యాన కళాశాలల జాబితాలో ఈ నూతన కళాశాలను కూడా చేర్చాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విద్యాసంవత్సనరంలోనే ప్రవేశాలు నిర్వహిస్తే శాశ్వత భవనం ఏర్పాటు చేసేవరకు తాత్కాలికంగా జిల్లా కేంద్రంలోనే అద్దె భవనాన్ని తీసుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

ఉద్యాన విద్యలో నూతన అధ్యాయం- భాస్కర్, అధిపతి, జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్, మల్యాల

మల్యాలలో ఏర్పాటు చేసే ప్రభుత్వ ఉద్యాన కళాశాల రాష్ట్రంలో మూడోది. ఈ కళాశాల ఏర్పాటుతో ఉద్యాన విద్యారంగంలో నూతన అధ్యాయం. ఉద్యాన విద్యపై ఆసక్తి ఉన్న వారికి ఇది వరంలాంటిది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు ఎక్కువగా ఉంటోంది. ఈ కళాశాల వల్ల పరిశోధన రంగం కూడా భవిష్యత్తులో మరింత అభివృద్ధి అవుతుంది. రైతులకు, ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

# అందుబాటులో నిధులు.. నత్తనడకన పనులు

పెద్దపల్లి : నియోజకవర్గ స్థాయి అభివృద్ధి నిధుల(సీడీపీ) వినియోగంలో జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి నిధులు విడుదలవుతూ వస్తున్నా ఖర్చు చేయడంలో పూర్తి స్థాయిలో వెనుకబడ్డారని ప్రభుత్వ నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే కొత్తగా పనులు ప్రారంభించే అవకాశం ఉండదు. అప్పటికే మొదలైన పనులపై కూడా యంత్రాంగం పర్యవేక్షణ కరవవుతుంది. అందుబాటులో నిధులున్నా అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో శాసనసభ్యులు ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్డీఎఫ్), ఉపాధిహామీ, డీఎంఎఫ్‌టీ నిధులతో మాత్రమే పనులు చేస్తున్నారే తప్ప తమకు సొంతంగా ఖర్చు చేసుకునేందుకు వీలున్న సీడీపీ నిధులపై దృష్టి సారించడం లేదు. ఎక్కువగా కమ్యూనిటీ గదులు, సీసీ రహదారులు, ఇతరత్రా చిన్నపాటి పనులను ప్రారంభించి వదిలేస్తున్నారు. ఇటు టెండర్లు పిలవడంలో జాప్యం, అటు ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో వీటి నిర్మాణ ప్రక్రియ సాధ్యమవుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు తమకు కేటాయించిన నిధులను ప్రజాప్రయోగ పనులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.కోట్లలో నిధులు.. రూ.లక్షలోనే వ్యయం

జిల్లాలోని 3 నియోజకవర్గాలుండగా ఒక్కో ఎమ్మెల్యేకు, ఒక ఎమ్మెల్సీకి



కలిపి ఏడాదికి రూ.5 కోట్లు చొప్పున రూ.20 కోట్లు కేటాయించారు. ఒక్కో ప్రజాప్రతినిధికి కేటాయించిన నిధుల నుంచి రూ.2 కోట్ల మేర 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి అందించారు. మిగిలిన రూ.3 కోట్లలో రూ.1,50,000 చొప్పున హరితనిధికి కేటాయించగా ఒక్కొక్కరికి దాదాపు రూ.2.98 కోట్లు మిగిలాయి. మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ కలిపి రూ.11,94,00,000 కోట్లు వచ్చాయి. ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుకు మొత్తం 60 పనులకు రూ.4.97 కోట్లు రాగా 5 పనులకు రూ.49.49 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా 53 పనులు కొనసాగుతుండగా రూ.4.37 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 2 పనులకు రూ.7.8 లక్షల విలువైన పనులు చేయాల్సి ఉంది. ఎమ్మెల్సీ కోటా కింద అదనంగా పెద్దపల్లి జిల్లాకు మాత్రమే 33 పనులకు గాను రూ.3.49 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.29.98 లక్షల విలువైన 3 పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న 28 పనులకు రూ.3.09 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.7.83 లక్షల విలువైన 2 పనులు కొనసాగుతున్నాయి. రామగుండం ఎమ్మెల్యే చందర్‌కు మొత్తం 40 పనులకు రూ.2.49 కోట్లు రాగా ఇందులో 7 పనులకు రూ.6.84 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా 33 పనులు జరుగుతుండగా రూ.2.48 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం ఎలాంటి పనులు జరగడం లేదు.

పెద్దపల్లి శాసనసభ్యుడు మనోహర్‌రెడ్డికి మొత్తం 61 పనులకు రూ.2.31 కోట్లు రాగా ఇందులో 12 పనులకు రూ.41.77 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో 45 పనులు కొనసాగుతుండగా ఇందుకు రూ.1.72 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 4 పనులకు రూ.12.78 లక్షల విలువైన పనులు చేయాల్సి ఉంది.

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మొత్తం 55 పనులకు రూ.2.49 కోట్లు రాగా ఇందులో 2 పనులకు రూ.13.27 లక్షలు మాత్రమే వెచ్చించారు. 51 పనులు కొనసాగుతుండగా రూ.2.29 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 2 పనులకు రూ.4.79 లక్షల విలువైన పనులు జరగాల్సి ఉంది.

# వ్యాధుల కాలం... అప్రమత్తతతోనే ఆరోగ్యం భద్రం

సిరిసిల్ల : ఎడతెరిపి లేని వర్షాలు, దిగజారుతున్న పారిశుధ్యం, దోమల వ్యాప్తి కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల నివారణకు పురపాలక సంఘాలు, పంచాయతీ పాలక వర్గాలు చర్యలు చేపట్టాల్సిన తరుణం ఇదే. ఖాళీ స్థలాల్లో దట్టంగా పెరిగే పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు తరలింపు, ఫాగింగ్ తదితర చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉంది.జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు సిరిసిల్ల, వేములవాడ పురపాలక సంఘాల పరిధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చేరి నిల్వ ఉండటంతో నీటిపై దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లో పంచాయతీ కార్మికులు ఇప్పటికే సమ్మెలో ఉన్నారు. పారిశుధ్య పనుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా సిరిసిల్ల పట్టణంలోని విలీన గ్రామాలతోపాటు శ్రీనగర్ కాలనీ, శాంతినగర్, గణేష్‌నగర్, సంజీవయ్యనగర్, పద్మనగర్, అశోక్‌నగర్, అంబికానగర్ తదితర ప్రాంతాల్లో మురుగు ప్రవహించే నాలాలు లేక వర్షం వస్తే వరద ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటే వ్యాధుల నియంత్రణకు అవకాశం ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కాలనీవాసులు పేర్కొంటున్నారు.జిల్లాలో గడిచిన అయిదేళ్లుగా ప్రధానంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాకాలంలో టైఫాయిడ్, గన్యా, డెంగీ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. మరోవైపు వ్యాధులను నివారించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వర సర్వేలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే తప్పకుండా ప్రతి ఇంటా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్తాచెదారం

ముస్తాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసంసమ్మెబాట పట్టారు. ఇరవై ఏడు రోజులుగా సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వలో వ్యర్థాలు చేరి మురుగు ముందుకు కదలడం లేదు. ముస్తాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం మొదలుకొని నూతన బస్టాండ్ వరకు ప్రధాన రోడ్డుపై ప్రతి ఆదివారం వార సంత నిర్వహిస్తుంటారు.

# అన్నదాతల కష్టం వరదపాలు

ఖమ్మం : అధిక వర్షాలు, వరదలతో అన్నదాతలకు కడగండ్లే మిగులుతున్నాయి. ఏటా ముంచెత్తుతున్న భారీ వరదలతో గోదావరి పరివాహక ప్రాంతంలో సాగు మనుగడే ప్రశ్నార్థకమవుతోంది. ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని పండిస్తున్న పంటలను వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయని, ఆదుకోండి మహాప్రభో.. అంటూ నెత్తినోరూ బాదుకుంటున్నా పాలకులు పట్టించుకోవట్లేదని రైతులు వాపోతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంటల సాగుపై ప్రకృతి పగబట్టినట్టుంది. గతేడాది వానాకాలంలో భారీ వర్షాలు, వరదల నుంచి వరుసగా మూడో సీజన్‌లోనూ అన్నదాతలు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గతేడాది గోదావరి ఉప్పొంగటం, వరదలు ముంచెత్తటం, ఆతర్వాత యాసంగి సీజన్ (మార్చి, ఏప్రిల్)లో భారీ వర్షాలు కురవటంతో పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో 18,500 మంది రైతులు 23వేల ఎకరాల్లో పంటలు నష్టపోయారు. భద్రాద్రి జిల్లాలో సుమారు 3వేల మంది రైతులకు చెందిన 8వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తాజాగా వారం పాటు ముంచెత్తిన వానలు రైతులకు భారీ నష్టాలే మిగిల్చాయి. ఖమ్మం జిల్లాలో 4వేల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు.

పంటల సాగు ప్రశ్నార్థకం

గోదావరి పరివాహకంలోని భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో పంటల సాగు నానాటికీ దయనీయంగా మారుతోంది. రైతుల కష్టమంతా వరదపాలవుతోంది. గతేడాది 128 గ్రామాల్లో



పత్తి, వరి, మొక్కజొన్న పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. 6,765 మంది రైతులకు చెందిన 17,637 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రూ.20కోట్ల మేర పెట్టుబడులు నష్టపోయారు. వరదల ధాటికి పంటపొలాల్లో 2-4 అడుగుల మేర ఇసుక మేటలు వేయడం వల్ల అన్నదాతలకు అదనపు భారం తప్పడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

రైతులకు పంట నష్టపరిహారం ఏళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలింది. ఏటా ఉభయ జిల్లాల్లో వర్షాలు, వరదల ధాటికి పంటలు దెబ్బతినటం, అధికారులు వివరాలు సేకరించటం పరిపాటిగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో పరిహారం అందటం లేదు. మార్చి, ఏప్రిల్‌లో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. కొంతమేర రైతులకు మేలు జరిగింది. గోదావరి వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఊసే లేకుండా పోయింది.

గతేడాది వానాకాలం పదెకరాల్లో వరి, 20 ఎకరాల్లో పత్తి సాగుచేశాను. పత్తి పంటకు ఎకరాకు రూ.15వేలు, వరికి ఎకరాకు రూ.10వేల పెట్టుబడి పెట్టాను. అప్పట్లో వచ్చిన వరదల ధాటికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లింది. ఈసారీ పంటలను వరదలు ముంచెత్తాయి. అధికారులు వివరాలు సేకరిస్తున్నా ఇప్పటివరకు పైసా పరిహారం అందలేదు.

వీరారెడ్డి, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపాడు మండలంచంద్రలబోడులో గోదావరి ఒడ్డున మూడెకరాల భూమి ఉంది. ప్రస్తుత సీజన్‌లో మూడెకరాల్లో పత్తి సాగుకు రూ.50వేలు వెచ్చించాను. గోదావరి ఉప్పొంగడంతో వరదలు ముంచెత్తి పంట కొట్టుకుపోయింది. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. గతంలో అధికారులు వచ్చి పంట నష్టం వివరాలు సేకరించినా పరిహారం అందించలేదు. ఈసారి అధికారులు రానేలేదు.కారం రామారావు, చంద్రలబోడు, అశ్వాపురం మండలం

# కూరగాయల సాగు తగ్గుతోంది!

వరంగల్ : జనగామ జిల్లాలో ఏటేటా కూరగాయలు పండించే రైతుల సంఖ్య తగ్గుతోంది. అధిక శ్రమ ఉండటం, కోతుల బెడద కారణంగా కూరగాయల పంటలపై ఆసక్తి చూపడం లేదు. ఓ వైపు సాగు తగ్గడం మరో వైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సహకాలు ఇవ్వడం లేదు. నాలుగేళ్ల క్రితం జిల్లాలో 4వేల ఎకరాల్లో కూరగాయల పంటలు పండితే ప్రస్తుతం వెయ్యి ఎకరాలకు తగ్గింది. సాగు తగ్గడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మంచి దిగుబడి, అధిక గిట్టుబాటు ధర, శ్రమ తక్కువ ఉన్న పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. అధికంగా వరి, పత్తి పంటకు అధిక ప్రాధాన్యతనిస్తుండగా ఆ తర్వాతి స్థానంలో మిర్చి పంట వేస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రోత్సాహం అందిస్తుండటంతో ఆ పంట వైపు రైతులు ఆసక్తి పెంచుకుంటున్నారు. శ్రమపడాల్సిన కూరగాయల సాగు తగ్గుముఖం పట్టింది. అధిక విస్తీర్ణంలో కూరగాయల సాగు చేసే రైతులు అరకొరగా మిగిలారు.

అవగాహన కల్పిస్తున్నాం..- కెఆర్.లత జిల్లా ఉద్యానవన శాఖాధికారి

కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సాగుకు ఆసక్తి కనపరిచే రైతులకు ఎకరానికి రూ.18 వేల విలువ గల టమాట, మిర్చి, వంకాయ నారును ప్రభుత్వం అందించే రాయితీతో రూ.1200 నుంచి 1500 లకు అందిస్తున్నాం. డీడీ తీసిన రైతులకు 20 రోజుల్లో నారు లభించేలా చర్యలు చేపట్టాం. తక్కువ శ్రమతో గిట్టుబాటు ధర లభిస్తున్న వరి వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులతో పాటు పల్లెల్లో పెరటి కూరగాయల సాగు, మిద్దె తోటలకు ఆసక్తి కనపరిచే రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

ప్రోత్సాహం అసరం- ప్రశాంత్, రామన్నగూడెం

కూరగాయల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందించాలి. సాగుకు భూమి సిద్ధం చేయడం మొదలు అధిక ధర విత్తనాలు, చీడపీడల బెడదల నివారణకు అధిక ఖర్చు, నిత్యం కోతులు, పక్షుల నుంచి పంటను రక్షించుకొనేందుకు అధిక శ్రమ పడాల్సి వస్తోంది. వాతావరణం సైతం అనుకూలించడం లేదు. పంటను సరైన ధరకు అమ్ముకొనేందుకు ప్రత్యేక మార్కెట్ లేదు.

# అడవి బిడ్డల విన్నపాలు వినవలె..




కొత్తగూడెం :రాష్ట్రంలోనే పెద్ద ఐటీడీఏగా గుర్తింపు పొందిన భద్రాచలం మన్యం పాలనపై పీఓ ప్రతీక్‌జైన్ క్రమంగా దృష్టి సారిస్తున్నారు. వరుస సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం తెలుసుకుంటున్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేస్తే ఏజెన్సీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అడవి బిడ్డలు ఆశిస్తున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో 32 మండలాల్లో మన్యం విస్తరించింది. దీనికి మహర్దశ రావాలంటే ప్రతి సోమవారం జరిగే దర్బారులో పీఓ అందుబాటులో ఉండాలి. వినతుల ప్రగతిపై నివేదికలను రూపొందించాలి. మూడేళ్ల ముందు దస్త్రాలకు ఇ-ఫైలింగ్ ఉండేది. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తపరచటం వల్ల ప్రతి విషయం పీఓకు తెలిసేది. కొంతకాలంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. దీన్ని పునరుద్ధరిస్తే పారదర్శకత వస్తుంది. ప్రధాన విభాగాల్లో యూనిట్ అధికారుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

విద్య, వైద్యం కీలకం

మన్యం విద్యలో డీడీ, ఆర్సీఓ విభాగాలు కీలకం. డీడీ పరిధిలో గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు ఉండగా వీటిలో 25వేల మంది బాలబాలికలు చదువుతున్నారు.

కొన్ని వసతిగృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చి సరిపడా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయలేదు. ఎక్కువచోట్ల సీఆర్టీలపైనే ఆధారపడ్డారు. ఇటీవల డీడీగా బాధ్యతలు చేపట్టిన మణెమ్మకు దిశానిర్దేశం అవసరం.

ఇంటర్, డిగ్రీ కళాశాలలు మంజూరుచేయాలి. ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్ బలోపేతమవ్వాలి. ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యేందుకు అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి.

బీఈడీ, డీఎడ్ కళాశాలలకు పూర్తిస్థాయి ప్రిన్సిపల్స్‌ను నియమించాలి.

వైటీసీ ద్వారా ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించాలి. ఎంప్లాయిమెంట్ ఉప కార్యాలయం సేవలను బలోపేతం చేయాలి.

ఆర్సీఓ పరిధిలోని ఒకటి నుంచి డిగ్రీ వరకు గురుకులాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలలు, ప్రతిభా విద్యాలయాల్లో 14వేల మంది చదువుతున్నారు. పూర్తిస్థాయి ఆర్సీఓను నియమించాలి. భవనాల కొరతను తీర్చాలి. మెనూ ఛార్జీలను ప్రభుత్వం పెంచినందున నాణ్యమైన ఆహారమందించాలి.

అదనపు డీఎంహెచ్ఓ ఎవరన్నది గందరగోళంగా మారింది. దీన్ని గుర్తించి సమస్యను పరిష్కరించాలి. ఏరియా ఆసుపత్రిలో నిపుణుల కొరత తలెత్తవద్దు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా దోమ తెరలు అందించాలి.

ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలకు అవకాశం లేకుండా చూడాలి. వీలైనంత తొందరగా పాలక మండలి సమీక్ష జరపాలి.

గిరిజనులు ఆశిస్తున్నవి

ట్రైకార్‌లోని పలు పథకాలు గిరిజనానికి ప్రయోజనం కలిగిస్తున్నాయి. ఒక్కోసారి బడ్జెట్ లేక యూనిట్లను అధికారులు ఆలస్యంగా అందిస్తున్నారు. త్రీఫేజ్ విద్యుత్తు సదుపాయం, సాగునీరు, అటవీహక్కుల చట్టం, ఎల్టీఆర్ చట్టం, కొండరెడ్ల సంక్షేమంపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

పోషకాహారమే ప్రధాన సమస్యగా మారినందున అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి. రుతు రుమాళ్లు, సబ్బులు, పోషకాహారం తయారీ వంటి చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను విస్తరించాలి.

వి-హబ్ ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించాలి. అభివృద్ధి పనుల్లో కీలకమైన ఇంజినీర్ విభాగంపై దృష్టి సారించాలి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవ్వాలి.

# కోక.. సరికొత్త కానుక..!



కొత్తగూడెం : మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చీరలను పంపిణీ చేయనుంది. సరికొత్త ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చీరలను శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ అందిస్తోంది. ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ప్రేమపూర్వక చిరుకానుక అందించాలని సర్కారు సంకల్పించింది. ఇప్పటికే బతుకమ్మ పండగ పురస్కరించుకొని ఏటా ఆడపడుచులకు చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అదే తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే మహిళా కార్మికులకు చీరలు అందించనుంది. జిల్లా విద్యాశాఖ కార్యాలయ గోదాములకు చీరలను సరఫరా చేసింది. మొత్తం 17 రంగులు, 240 డిజైన్లు, ఆరున్నర మీటర్ల పొడవుతో చీరలు ఉండనున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న పురుషులకు త్వరలో చొక్కాలు, దోతీలను ప్రభుత్వం అందజేయనుంది. వంట నిర్వహణ సమయంలో కార్మికులు ధరించేందుకు యాప్రాన్లు ఇవ్వనుంది.

ఇదీ పరిస్థితి..ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వంట చేసే మహిళలకు చీరలు అందనున్నాయి. ఖమ్మం జిల్లాలో 1,264 పాఠశాలల్లో 2,240 మంది, భద్రాద్రి జిల్లాలో 1,375 పాఠశాలల్లో 2,097 మంది వంట ఏజెన్సీ కార్మికులుగా పనిచేస్తున్నారు. వారం రోజుల్లో ఎంఈఓ కార్యాలయాల నుంచి కాంప్లెక్స్ పరిధిలో సీఆర్పీల ద్వారా పాఠశాల స్థాయిలో చీరలను పంపిణీ చేయనున్నారు. డీఈఓ కార్యాలయాలకు చీరలు చేరుకున్నాయి. బతుకమ్మ పండగకు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు అందిస్తుండటం శుభపరిణామం. అర్హులకు వారంలో పంపిణీ చేస్తాం.సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# ఉద్యోగ విరమణ... విజిలెన్సు విచారణ?



కొత్తగూడెం :మణుగూరు ఏరియాలో ఓ ఉద్యోగి ఉద్యోగ విరమణ కార్యక్రమంపై విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు. ఏరియాలోని సాంకేతిక విడిభాగాలు రూపొందించే ప్రాంతీయ కారా?నాలో పనిచేసే ఓ ఉద్యోగి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. కార్యక్రమం కారా?నాలో అట్టహాసంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించటంపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించకుండా ఏరియా వర్కుషాపులో సదరు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొనటంతో చర్చనీయాంశంగా మారింది. కార్మికులు విధులకు 10 నిమిషాలు ఆలస్యం అయితేనే అనుమతించని యాజమాన్యం, రోజంతా అధికారులు, ఉద్యోగులు పని చేయకుండా ఉత్పత్తికి విఘాతం కలిగేలా ఉద్యోగ విరమణ వేడుకలకు హాజరుకావటం గమనార్హం. సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను యాజమాన్యం సన్మానించటం పరిపాటి. ఆ కార్యక్రమానికి కార్మికుల కుటుంబ సభ్యులను యాజమాన్యం అనుమతించదు. కానీ సోమవారం జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఉద్యోగి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల తోపాటు, ప్రజాప్రతినిధులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. భోజనాలు, జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తతంగం అంతా ఏరియాలో ఓ అధికారి పర్యవేక్షణలో జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగితో ఆ అధికారి సన్నిహితంగా ఉండటంతోనే వేడుక జరిగిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ విరమణ వేడుకను విజిలెన్సు అధికారులు వీడియో తీసి, ఉన్నతాధికారులకు చేరవేసినట్లు సమాచారం.

# పాతపైపులతో మరమ్మతు పనులు

మల్యాల : మల్యాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సూరప్ప చెరువు పక్కన ఇటీవల వరద నీరు వెళ్లడానికి వీలుగా గండికొట్టిన బైపాస్ రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. ఇంజినీరింగు అధికారులు సరైన ప్రణాళికతో వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో బైపాస్ రహదారి మధ్య ఏటా వరద నీరు వెళ్లడానికి వీలుగా గ్రామ పంచాయతీ అధికారులు గండికొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బారీ వర్షాల కారణంగా గతనెల 27న బైపాస్ రహదారికి గండికొట్టారు. మూడేళ్ల నుంచి వరుసగా వర్షాల కారణంగా ఈ రహదారి మధ్య గండి కొడుతుండటంతో మల్యాల నుంచి పెగడపెల్లి మండలానికి రవాణా వ్యవస్థ దెబ్బతింటోంది. వారం క్రితం వరద చెరువులోకి వెళ్లడానికి వీలుగా మల్యాల నుంచి పెగడపెల్లి మండలానికి వెళ్లే సదరు బైపాస్ రహదారి మధ్య గండికొట్టడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సర్పంచి సుదర్శన్, ఈవో రవీందర్ రహదారి మరమ్మతుకు చర్యలు చేపట్టారు. ఏళ్ల క్రితం జగ్గని ఒర్రెలో శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఇంటికి వెళ్లడానికి వీలుగా పైపులతో నిర్మించుకున్న దారి కొట్టుకుపోవడంతో అవే పాత శిథిలమైన పైపులను తీసుకెళ్లి రహదారి మరమ్మతు పనులకు వినియోగిస్తుండటం పలు విమర్శలకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఈవో రవీందర్‌ను సంప్రదించగా త్వరలో వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రకృతి విపత్తు.. విద్యుత్తు శాఖ చిత్తు

వరంగల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)కు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఉపకేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) వరదనీటిలో మునిగాయి.. ఈదురు గాలులకు 11, 33 కేవీ లైన్ స్తంభాలు నేలకూలాయి.. బొందివాగు వరదలో డీటీఆర్‌లు మునిగిపోవడంతో వరంగల్ నగరంలో కరెంటు సరఫరా నిలిచింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంలో పీటీఆర్, ఫీడర్లు, డీటీఆర్‌ల నుంచి కరెంటు సరఫరా పునరుద్ధరించడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 14.28 లక్షల గృహ వినియోగదారులు ఉన్నారు. ఐదు రోజుల పాటు ఎడతెరిపిలేని వర్షాలతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు..

వరంగల్ హంటర్‌రోడ్డు బొందివాగు నాలా ఉద్ధృతితో ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీలో రెండు విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. ఒక నియంత్రికపై దెబ్బతినింది. తాత్కాలిక మరమ్మతులతో కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. రంగంపేట కూడలిలో నియంత్రిక



నీట మునగడంతో సరస్వతి కాలనీ, మున్సిపల్ ఉద్యోగుల కాలనీ, భద్రకాళి దేవాలయం రోడ్డుకు నాలుగు రోజుల పాటు విద్యుత్తు సరఫరా నిలిపివేసి, ఆదివారం పునరుద్ధరించారు.

నీట మునిగిన నియంత్రిక..నర్సంపేట రూరల్ సెక్షన్ పరిధిలో రెండు విద్యుత్తు నియంత్రికలు, 38 స్తంభాలు దెబ్బతిన్నాయి. గురిజాలలో పెద్ద చెరువు వాగు ప్రవాహానికి ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో మునిగింది. విద్యుత్తు సరఫరా లేక తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సర్పంచి మమత తెలిపారు. నియంత్రికను మరోచోటుకు మారుస్తామని ఏఈ సంపత్ తెలిపారు. ప్రస్తుతానికి చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నర్సంపేట రూరల్

పునరుద్ధరణ

ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్తు నియంత్రికలు దెబ్బతిన్నాయి. స్తంభాలు నేల కూలి 20గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మనుబోతులగడ్డ, మంగళవారిపేట, ధర్మారావుపేటల్లో నియంత్రికలు దెబ్బతిన్నాయి. ఆరు స్తంభాలు కూలాయి. సంబంధిత శాఖ సిబ్బంది వేగంగా పనులు చేపట్టి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారి సంపత్ తెలిపారు. ఖానాపురం

విరిగిపడిన స్తంభం

కొత్తపల్లి ఆకేరు వాగు నుంచి ఇల్లంద వెళ్లే దారిలో విద్యుత్తు నియంత్రికపై స్తంభం విరిగిపడింది. ఇల్లంద శివారులో మరో స్తంభం నేలకొరిగింది. రైతులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు వచ్చి పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఇతర మార్గాల్లో విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ సిబ్బంది ఒకరు తెలిపారు. నేలకొరిగిన స్తంభాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. వర్ధన్నపేట

తెప్పపై చెరువులోకి వెళ్లి..

ఖానాపురం మండలం దబ్బీరుపేటకు వెళ్లే లైన్ స్తంభాలకు ఇన్సులేటర్ పగిలి మూడు గ్రామాలకు రెండ్రోజుల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అశోక్‌నగర్ నుంచి లైన్‌ను చెక్ చేసినా అధికారులు దబ్బీరుపేట చెరువులోని స్తంభం లైన్ ఇన్సులేటర్ పగలి బ్రైక్‌డౌన్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో జేనియర్ లైన్‌మెన్ జాటోతు వినోద్ చెరువులో చేపల వేటకు మత్స్యకారులు ఉపయోగించే తెప్ప తెప్పించుకొని చెరువులోకి వెళ్లి స్తంభం ఎక్కి ఇన్సులేటర్ బిగించడంతో సమస్య పరిష్కారం అయింది. అతడి చొరవను ఎన్పీడీసీఎల్ అధికారులు అభినందించారు. నర్సంపేట

యుద్ధప్రాతిపదికన..కుండ పోత వర్షాలకు నర్సంపేట డివిజన్‌లో విద్యుత్తు శాఖకు రూ.20 లక్షలకు పైగా నష్టం జరిగింది. 250కి పైగా స్తంభాలు విరిగిపడ్డాయి. ఐదు నియంత్రికలు పాడయ్యాయి. సుమారు 80 గ్రామాల్లో రెండు రోజుల పాటు కరెంటు సరఫరా నిలిచి పోయింది. డీఈ సదానందం పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి కరెంటు సరఫరా పునరుద్ధరించారు. నర్సంపేట

అంధకారంలో తండా వాసులు

నెక్కొండ మండలంలోని చెరవుముందరి తండా శివారు సోమ్లా తండా వాసులు అంధకారంలో ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఐదు స్తంభాలు విరగడంతో కరెటు సరఫరా లేక చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజుల అనంతరం అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసినా, ఇంకా తీగలు బిగించలేదు. నెక్కొండ

## నమ్మండి.. వాగులు కావివి.. వరి పొలాలే

రామడుగు : రామడుగు మండలంలో మోతెవాగుకు ఆనుకుని ఉన్న పంట భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొలాలు కోతకు గురికావడంతోపాటు ఇసుక మేటలు వేయడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. రామడుగు, షానగర్, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల గుండా మోతె వాగు ప్రవహిస్తోంది. ఈ గ్రామాల్లో సుమారు 50 ఎకరాల పంట భూములు దెబ్బతిన్నాయి. వీటిని పూర్వ స్థితికి తీసుకురాలేమని రైతులు వాపోతున్నారు. గతేడాది భారీ వరదలకు మోతెవాగుపై ఉన్న ఆరు చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. ఆ సమయంలోనూ ఇదే పరిస్థితి ఉండగా.. రూ.లక్షలు వెచ్చించి ఇసుక మేటలు తొలగించిన రైతులు గత సీజన్‌లో యాసంగి పంట సాగు చేశారు. ఈసారీ భారీ వర్షాలు కురవడంతో మళ్లీ నష్టం వాటిల్లింది. చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి ఉండడంతో వాగు ప్రవాహం కొత్త దారిలోకి మళ్లింది. రూ.లక్షలు విలువ చేసే పంట భూములు కోతకు గురికావడంతో అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయారు.చిగురుమామిడి మండలంలోని చెరువులు, కుంటలు నిండి గండ్లు పడ్డాయి. వరి నాట్లు వేసిన పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. సీతారాంపూర్, బండారిపల్లి, పెద్దమ్మపల్లి గ్రామాల్లో దాదాపు 70 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వాటిని తీయాలంటే వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారాంపూర్‌కి చెందిన నందయ్య, సమ్మయ్య అనే రైతులు తమకున్న రెండెకరాలలో.. ఎకరం పొలంలో ఇసుక మేటలు వేసి నాటు వేయరాకుండా ఉందని తెలిపారు. ఇసుక తొలగించడానికి తమ వద్ద డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

# దళిత బంధు.. ఉపాధి మెండు

వరంగల్ :'ఎంతోమంది వ్యక్తిగతంగా ట్రాక్టర్లు, బొలెరో వాహనాలను కొనుగోలు చేశారు.. ముగ్గురు, నలుగురు కలిసి జేసీబీ, వరి కోత యంత్రాలను కొనుగోలు చేసి విజయవంతంగా నడిపించుకుంటున్నారు' దళిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకం దళిత బంధు. ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షలు అందడంతో తమకు నచ్చిన యూనిట్లు ఎంపిక చేసుకుని స్థిరపడుతున్నారు. నైపుణ్యమున్న దళిత యువకులు ఈ పథకం ద్వారా వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా స్థిరపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి దశలో ఎంపికైన లబ్ధిదారులు మినీ డైరీలు, కోళ్ల ఫారాలు, వస్త్ర, చెప్పుల దుకాణాలు, టెంట్ హౌస్, ఫ్లెక్సీ ప్రింటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. దళిత బంధు సహాయంతో జీవితాలను వెలుగుల విందుగా మార్చుకున్నవారిపై ప్రత్యేక కథనం... –ఈనాడు డిజిటల్, మహబూబాబాద్

యూనిట్ల పంపిణీ..ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొలివిడత 5,217 యూనిట్లు పంపిణీ చేశారు. ఇందులో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలానికి పైలట్ ప్రాజెక్టులో భాగంగా 3901



యూనిట్లను కేటాయించారు. మొత్తంగా రూ. 521.7 కోట్లు అందించారు. ఒకప్పుడు కూలీ, డ్రైవరుగా పనిచేసిన తాము యజమానులుగా మారి నలుగురికి ఉపాధి కల్పిస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండిలా..దళితబంధు పథకం యూనిట్ కోసం లబ్ధిదారులు ముందుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అందుకు అవసరమైన ఫారం ఆ కార్యాలయంలోనే ఇస్తారు. దరఖాస్తుదారులు అందులో తమ పూర్తి వివరాలను నమోదు చేసిన తర్వాత వాటికి కుల ధ్రువీకరణ, రేషన్, ఓటర్ ఐడీ, ఆధార్, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ పత్రులను జత చేయాలి. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సంబంధిత ఎంపీడీవోకు అందించాలి.

# హరితహారానికి గొడ్డలిపెట్టు

కరీంనగర్: హరితహారం ఆదర్శమని మన్ననల్ని అందుకున్న కరీంనగర్ నగరంలోనే ఇటీవల ఇష్టానురాజ్యంగా చెట్లను కొందరు నేలకూలుస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారికి జరిమానాలు విధించిన దాఖలాలు లేవు. హరితహారంలో భాగంగా 2018లో సీఎం కేసీఆర్ స్వయంగా ఎల్ఎండీ ఆనకట్టను ఆనుకుని ఉన్న స్థలంలో మొక్కల్ని నాటి అందరిలో స్ఫూర్తి నింపారు. ఆ తర్వాత ప్రతీ వానాకాలంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఐదు రకాల మొక్కలను అందించడంతోపాటు ఖాళీ ప్రదేశాలు, అవెన్యూ ప్లాంటేషన్‌లతో లక్ష్యానికి మించి పచ్చని ప్రగతిని చేతల్లో చూపించారు. 60 డివిజన్ల పరిధిలో గడిచిన మూడేళ్లుగా వేల సంఖ్యలో చెట్టు మోడువారాయి. నగరంలో దాదాపుగా 78వేల ఇళ్లుంటే ఇందులో సగం ఇళ్ల చెంతన చెట్లే ఉండటం లేదు. పురపాలిక నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టే ప్రతి గృహం చెంతన మొక్కలను నాటుతూ వాటిని పెంచి సంరక్షించేలా యంత్రాంగం చొరవ చూపాలి.

నగరంలోని జ్యోతినగర్ వీధిలో విద్యుత్తు సిబ్బంది ఇలా చెట్లను ఇష్టానురాజ్యంగా తొలగించేస్తున్నారు. పైన ఉన్న విద్యుత్తు తీగలకు కొమ్మలు తగులుతూ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కొంతకాలంగా దాదాపుగా అన్ని వీధుల్లో ఇలానే జరుగుతున్నా.. నగరపాలక సంస్థ, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఇదేం పెద్ద తప్పుకాదనే తీరున చోద్యం చూస్తున్నారు.

కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ రోడ్డుకిరువైపులా రెండేళ్ల కిందట చూడచక్కని తీరున పెరిగిన మొక్కలన్నీ ఇప్పుడు అధ్వానస్థితికి చేరాయి. విద్యుత్తు తీగల సాకుతో కొన్ని.. రోడ్డు పక్కన, ఇళ్లచెంతన అడ్డుగా ఉన్నాయని మరికొన్ని చెట్లను తొలగించారు. ఆయా కాలనీల్లో ఇళ్ల



చెంతన ఆకులు రాలుతున్నాయని.. వాటిని ఊడ్చటం, ఎత్తిపారేయడం కష్టమని భావించి ఇంకొందరు కాండం మాత్రమే మిగిలేలా గొడ్డలి వేటు వేస్తున్నారు.

ఏం చేయాలి.. ఏం చేస్తున్నారు..!

వానాకాలం, వేసవిలో గాలుల బీభత్సంతో అక్కడక్కడ విద్యుత్తు తీగలకు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుంది. అందుకని ప్రతీ మూణ్ణెళ్లకోసారి విధిగా చెట్ల కొమ్మలు ఎక్కడైతే తీగలను తాకుతాయో వాటిని మాత్రమే పొడవాటి కర్రకు కొడవలి కత్తిని కట్టి కొమ్మలను మాత్రమే తొలగించాలి. ఈ ప్రక్రియను అటు విద్యుత్తు, ఇటు నగరపాలక సంస్థ సిబ్బంది సమన్వయంతో కొనసాగాలి. కాని పదే పదే తమకు ఇబ్బంది అనే ఉద్దేశంతో విద్యుత్తు సిబ్బంది ఎక్కడకికక్కడ కాలనీల్లో చెట్లను గొడ్డలితో నరికేస్తున్నారు. తమ ఇంటి వద్ద ఉన్న వృక్షంతో ఇబ్బంది అనే ఉద్దేశంతో ఇంటి యజమానులు కూడా దగ్గరుండి మరీ.. చెట్లను నేలకూలుస్తున్నారు. ప్రహరీలకు ఇబ్బందిగా మారుతుందని.. నిర్వహణ భారమనే సాకుతో కొందరిలా ఉన్న చెట్లను కనుమరుగయ్యేలా చేయడం మానుకోవాలి. మరోవైపు నిబంధనల ప్రకారం కొమ్మలను మాత్రమే తొలగించాలని, ఎక్కడా గొడ్డలి వాడొద్దని సిబ్బందికి చెబుతున్నామని విద్యుత్తు శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు.

# చుక్కల్లో మిరప విత్తన ధరలు



ఖమ్మం : రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొన్ని కంపెనీలు మిరప విత్తనాల పేరిట నిలువు దోపిడీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా పావులు కదుపుతున్నాయి. మిరప విత్తనాల విషయంలో అన్నదాతలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే వచ్చే సీజన్‌లో నిండా మునిగే ప్రమాదం ఉంది. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా మిరప సాగు చేసే జిల్లాల్లో ఖమ్మం ప్రథమ స్థానంలో ఉంది. ఆ తర్వాత మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు ఉంటాయి. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులు విత్తనాల కోసం ఖమ్మంపైనే ఆధారపడతారు. సూర్యాపేట, నల్గొండ జిల్లాలతో పాటు ఏపీకి చెందిన కొందరు రైతులు ఇక్కడ కొనుగోలు చేస్తారు. ఏటా రూ.కోట్లాది వ్యాపారం జరుగుతుంది. అందుకే ఇప్పుడు విత్తన వ్యాపారులు మొత్తం ఖమ్మం జిల్లాపై దృష్టి సారించి తమ వ్యాపారాలను విస్తరించాలని యోచిస్తున్నారు.

మార్కెట్లోకి రాకముందే ...

మార్కెట్లోకి రాకముందే మిరప విత్తనాల ధరలు మండుతున్నాయి. కొన్ని రకాల ధర కిలోకు రూ. 80 వేల నుంచి రూ.లక్షన్నర వరకు పలుకుతోంది. అడ్వాన్స్ బుకింగ్ పేరిట వాటి ధరల్ని రెట్టింపు చేస్తున్నారు. ఈ ఏడాది మిరపకు డిమాండ్ ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. క్వింటా రూ. 23 వేల నుంచి రూ. 24 వేల వరకు ధర పలుకుతోంది. వచ్చే ఏడాది అధిక విస్తీర్ణంలో మిరప నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే పొలాలను కౌలుకు తీసుకుని విత్తనాల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు. నల్ల తామర, వైరస్‌ను తట్టుకుంటాయనే ప్రచారంతో కొన్ని రకాలపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకే ఈసారి విత్తనాల ధరలు చుక్కలనంటుతున్నాయి. సాధారణంగా జూన్, జులైలో మిరప నారు పోస్తారు. ఆగస్టు, సెప్టెంబరులో మొక్కలు నాటుతారు. విత్తనాల అమ్మకాలు మే నెలలో మొదలవుతాయి.

పెరగనున్న సాగు విస్తీర్ణం

ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 68 వేల ఎకరాల్లో రైతులు మిరప సాగు చేశారు. ప్రస్తుతం ధర బాగున్నందున వచ్చే సీజన్‌లో 1,00,000 నుంచి 1,10,000 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో రైతులు పండించగా ఈసారి మరో 20 వేల ఎకరాలు సాగు చేస్తారని భావిస్తున్నారు. చాలామంది రైతులు పోటీ పడి పొలాలను కౌలుకు తీసుకుంటున్నారు. కౌలు ధర కూడా పెరిగింది.

ముందస్తు బుకింగులు షురూ..

ఉభయ జిల్లాల్లో పేరున్న విత్తన డీలర్లు ఇప్పటికే రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకు కంపెనీలకు డిపాజిట్లు చెల్లించారు. కంపెనీలు ముందస్తు ఒప్పందం ప్రకారం ఇప్పుడు ధరలు పెంచాయి. ఈసారి విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో ఎలాగైనా విత్తన కొరత వస్తుందనే ఉద్దేశంతో అడ్డదారుల్లో నల్లబజారులో విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మిరప నర్సరీలు సైతం రెండు జిల్లాల్లో రూ.కోట్ల వ్యాపారం చేస్తున్నాయి. నర్సరీల నిర్వాహకులు సైతం మొక్కల వ్యాపారంతో సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నారు. విత్తన వ్యాపారులు ఒకవైపు, నర్సరీల యజమానులు మరోవైపు రైతులను మోసగించే ప్రయత్నాల్లో ఉన్నారు. మిరప అధిక విస్తీర్ణంలో సాగు చేసే మండలాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. సందట్లో సడేమియా మాదిరిగా కొన్ని నకిలీ కంపెనీలు సైతం ఈ వ్యాపారానికి తెర లేపుతున్నట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను పటిష్ఠ పరిస్తేనే..అధిక ధరలకు విత్తనాలు విక్రయించకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు, మొక్కలను అరికట్టాలి. అక్రమాలను నిరోధించేందుకు ఇప్పటి నుంచే పటిష్ఠమైన టాస్క్‌ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. గత సీజన్‌లోనూ నకిలీ విత్తనాలు జిల్లాలోకి వచ్చిన విషయం తెలిసిందే.

# దళారులదే హవా.. జీసీసీది ప్రేక్షక పాత్ర..!



ఖమ్మం : అటవీ ఉత్పత్తులు సేకరించి మన్యం బిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనివ్వాలన్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) లక్ష్యం నీరుగారుతోంది. జీసీసీలో కొంతమంది అధికారులు, సిబ్బంది సహకారంతో దళారులు రాజ్యమేలుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం ఏజెన్సీలో గిరిజనుల నుంచి 2023-24లో రూ. 200 కోట్ల అటవీ ఉత్పత్తులు కొనాలని జీసీసీ నిర్ణయించింది. అటవీ ప్రాంతం నుంచి గిరిజనులు తీసుకొచ్చిన ముష్టిగింజలు, విప్పపువ్వు, విప్పపరక కొనుగోళ్లు సేల్స్ డిపోల్లో జరిగేలా ఏర్పాట్లు చేసింది. వివాదాల గండం నుంచి భద్రాచలం జీసీసీ గట్టెక్కడం లేదు. గతేడాది నారాయణపురం జీసీసీ గోదాములో సుమారు 900 క్వింటాళ్ల ముష్టిగింజలు మాయమైన ఘటన సంచలనం సృష్టించింది. పలువురు అధికారులపై వేటు పడింది. వివిధ మండలాల గోదాముల్లోని నిల్వలపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈవ్యవహారంపై శాఖాపరమైన విచారణ సాగుతోంది. గిరిజనుల నుంచి మూడు క్వింటాళ్ల ముష్టిగింజలను దళారులు కొని అక్రమంగా తరలిస్తుండగా గుండాల పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. తాజాగా ముల్కలపల్లిలో జీసీసీ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్, డీజిల్ అమ్మకంపై వచ్చిన మొత్తంలో రూ. 50 లక్షలు పక్కదారి పట్టినట్లు మరో ఘటన వెలుగుచూసింది.

మాయమాటలు చెప్పి.. దొడ్డిదారిన తరలించి గిరిజనుల నుంచి గిట్టుబాటు ధరకు అటవీ ఉత్పత్తులను కొనాల్సిన జీసీసీ.. దళారులోకు అండగా నిలుస్తుందనే వాదనలున్నాయి. కొన్ని నెలలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో ముష్టిగింజల కొనుగోళ్లలో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. సేల్స్ డిపోల్లో సాగాల్సిన కొనుగోళ్లు ఏకంగా ఏజెన్సీ పల్లెల్లోనే జరుగుతున్నాయి. గిరిజనులకు దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ముష్టిగింజలను ఖరీదు చేస్తున్నారు. ప్రస్తుతం జీసీసీ కేంద్రాల్లో కిలో ముష్టిగింజల ధర రూ. 45 పలుకుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో దళారులు రూ. 35కే కొంటున్నారు. వీటికి ఛత్తీస్‌గఢ్‌లో డిమాండ్ ఉండటంతో దొడ్డిదారిన అక్కడికి తరలిస్తున్నారు. కిలో సరకును రూ. 90 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా జీసీసీ ఆదాయానికి గండిపడుతుండటమే కాకుండా గిరిజనులకు గిట్టుబాటు ధర అందకుండా పోతోంది.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే..భద్రాచలం ఏజెన్సీ కేంద్రంగా ముష్టిగింజల కొనుగోళ్లలో సాగుతున్న దందాలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు వ్యాపారులతో పాటు స్థానిక దళారులు చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. వీరికి జీసీసీలోని కొందరు అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దళారులు నేరుగా ఆయా ప్రాంతాలకే వెళ్లి తక్కువ ధరకు గిరిజనుల నుంచి ముష్టిగింజలు కొంటున్నారు. అనుమతుల్లేని ప్రత్యేక వాహనాల్లో రాత్రికి రాత్రే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు.

ముష్టిగింజల కొనుగోళ్లపై ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే రూ.కోట్లలో జీసీసీ ఆదాయం పెరిగే ఆస్కారముంది. గత అనుభవాలు, జీసీసీ ఎదుర్కొన్న ఆరోపణల నేపథ్యంలో ఈసారి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. కొనుగోళ్లలో అవకతవక లకు ఆస్కారమివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అందిన ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నాం. అక్రమ వ్యాపారం సాగుతున్నచోట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాం. అక్రమ కొనుగోళ్లలో జీసీసీ యంత్రాంగం హస్తముంటే కఠిన చర్యలు తీసుకుంటాం. విజయ్‌కుమార్, జీసీసీ డీఎం, భద్రాచలం

# మూలన పడ్డ పార్సిల్ ప్యాకింగ్ యూనిట్!

ఖమ్మం : ఇటీవల తపాలాశాఖ ఆధునికతతో కూడిన అద్భుత ప్రయోగాల వైపు అడుగులు వేస్తోంది. ఇలా అందివచ్చిన యంత్రాలు కొన్ని మూన్నాళ్లకే మూలకు చేరుతున్నాయి. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో పార్సిల్ ప్యాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఆధునిక యంత్రాలు అందివచ్చాయి. ఆరు నెలల కిందట ప్రారంభించిన పార్సిల్ ప్యాకింగ్ యూనిట్‌కు స్థానికంగా మంచి స్పందన వచ్చింది. విదేశాలకు సరకులు పంపాలనుకునే వారు కూడా ఇక్కడికే వచ్చారు. ఇంతటి స్పందన ఉన్న యూనిట్ నెల రోజులుగా మూలకు చేరింది. వచ్చే వినియోగదారులు అసహనంగా తిరిగి వెళ్లిపోతున్నారు. ఇలా వెళ్లిన వారు తిరిగి ఇక్కడికి వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ప్యాకింగ్‌కు ఉపకరించే పట్టీలు లేవని ఈ మొత్తం యూనిట్‌ను మూలన పడేశారు. వాటి కోసం ఆర్డర్ పెట్టామని రాగానే సేవలు పునరుద్ధరిస్తామని పోస్ట్‌మాస్టర్ కిరణ్‌కుమార్ వివరించారు.




# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేదెప్పుడో?

వరంగల్ : జిల్లాలో యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి. అన్ని గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. ఇతర జిల్లాలతో పోల్చితే యాసంగి సీజన్‌లో జనగామ జిల్లాలో ఒకటి, రెండు నెలలు ముందుగా వరి సాగు చేశారు. దీంతో 10 రోజుల నుంచే ధాన్యం కోతలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు భారీగా పేరుకుపోయాయి. వడగళ్ల వానలు, గాలి బీభత్సం కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. గత అనుభవాల దృష్ట్యా రైతులు ముందుగానే వరి కోతలు చేపట్టడంతో విక్రయానికి ధాన్యం సిద్ధంగా ఉంది.

జిల్లాలో పరిస్థితి

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1.93 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. ఈ మేరకు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ప్రైవేటు, విత్తన కంపెనీల విక్రయాలు, రైతుల అవసరాలు.. తదితర విభాగాలకు ధాన్యం పోగా మిగిలిన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు



చేరుతుందని.. అందుకు తగినట్లుగా 200 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు 20 రోజుల క్రితం అధికారులు వెల్లడించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పౌరసరఫరా, పీఏసీఎస్ శాఖలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నా.. వేగవంతం చేయడంలో జాప్యం జరుగుతోంది. పది రోజుల క్రితమే ధాన్యం కోతలు ముమ్మరమైనా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు వారి సొంత అవసరాలు, అప్పులను తీర్చుకునేందుకు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా 2, 3 కేంద్రాలను మాత్రమే ప్రారంభించగా.. మిగిలిన కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాంగూడూరు రాంరెడ్డి, డీఆర్డీవోజిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ పూర్తయింది. ఇప్పటికే వీటికి సంబంధించిన సమీక్షలు, సమావేశాలు జరిగాయి. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశాం. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

# మామిడికి మంగు

జగిత్యాల : జగిత్యాల సహా తెలంగాణలోని జిల్లాల్లో మామిడిపై పెరిగిన చీడపీడల నివారణకు పరిశోధనాత్మక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి నిరుడు వేసవిలో భారత వ్యవసాయ పరిశోధన మండలికి, కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు విన్నవించారు. రాష్ట్రమంత్రి వినతిపై కేంద్రం నుంచి క్షేత్రస్థాయి చర్యలు లేకపోగా ఇటు రాష్ట్ర పరిధిలో ఉద్యాన వర్సిటీ, ఉద్యానశాఖ ద్వారానూ తదనుగుణ చర్యలను విస్మరించారు. ఫలితంగా ఈ సారి కూడా మామిడిపై చీడపీడల తీవ్రత మరింతగా పెరిగి కాయల నాణ్యతను దెబ్బతీసి ధర, ఎగుమతులను ప్రభావితం చేస్తోంది.

మామిడి చరిత్రలోనే రెండేళ్లుగా మంగు ఆశిస్తోంది. దీని ప్రభావంతో నిరుడు దాదాపుగా 30 శాతం వరకు ధరలు తగ్గాయి. ఈ సీజన్‌లో మంగుతో పాటుగా కాయల తొడిమ వద్ద కుళ్లిపోవటం మరింత అధికమైంది. ప్రస్తుతం జగిత్యాల మామిడి మండీలో బంగినపల్లి రకానికి క్వింటాలుకు రూ. 2,000–3,300 వరకు ధర పలుకుతుండగా కొద్దిగా మంగు సోకిన కాయలకు క్వింటాలుకు రూ. 1,000–2,000 ధర చెల్లించారు. కాయలపై మంగు మచ్చలు అధికంగా ఉన్నపుడు అసలే కొనుగోలు చేయకపోవటంతో రైతులు, తోటలను గుత్తకు తీసుకున్నవారు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం కాయలను తెంపే సమయం కాబట్టి చీడపీడల నివారణ సాధ్యపడక ఈ సీజన్‌లో ఇప్పటికిప్పుడు కాయలపై మరకలు తగ్గించే అవకాశమే లేకుండా పోయింది.

పదింతలు పెరిగిన మచ్చలు..

ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 75 వేల ఎకరాల వరకు మామిడి తోటలుండగా సాధారణ పరిస్థితుల్లో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కాయలను ఎగుమతి చేస్తారు. కానీ ఈ సంవత్సరం ఆశించినట్లుగా కాపు రాలేదు. మామిడి కాపు తగ్గడానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, చలిలో తేడాలు, గాలిలో తేమ, మంచు వాతావరణం, అధిక వర్షాలు, నేలలోని తేమ, గంటల వ్యవధిలోనే మారిన వాతావరణ పరిస్థితులు ముఖ్య కారణాలు కాగా వీటికి చీడపీడలు తోడయ్యాయి. మామిడిపై తామర పురుగులు, రసంపీల్చు పురుగులు, తేనెమంచు, లద్దెపురుగులు, ఇతరత్రా కాయకుళు్, బూడిద తెగులు తదితరాలు పూత, కాతను రాలేలా చేశాయి, కాయలకూ నష్టం కలిగిస్తున్నాయి. చీడపీడల తీవ్రతతో కాయలపై మచ్చలశాతం మూడేళ్లక్రితంతో పోలిస్తే పదింతలు పెరిగిందని మామిడి కొనుగోలుదారులు పేర్కొంటున్నారు. జగిత్యాల సహా ఉమ్మడి జిల్లా నుంచి మామిడి కాయలను దిల్లీ కేంద్రంగా ఇతర రాష్ట్రాలు, పలు దేశాలకు ఎగుమతి చేస్తారు. నాణ్యత రీత్యా జగిత్యాల మామిడికి బ్రాండ్ ఇమేజ్ ఉండగా కాయలపై మచ్చలతో దిల్లీ మార్కెట్లో ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాణ్యమైన మామిడి రావటంతో దిల్లీలో అధికధర చెల్లిస్తున్నారని, ఇదే పరిస్థితి మరో రెండేళ్లు కొనసాగితే మన మామిడికున్న బ్రాండ్ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సామూహికంగా చేపడితేనే..కనీసం వచ్చే ఏడాదికైనా మామిడిపై చీడపీడలు తగ్గాలంటే ములుగు, సంగారెడ్డి ఉద్యాన ఫల పరిశోధనస్థానానికి చెందిన నిపుణులైన మామిడి శాస్త్రవేత్తలతో ప్రస్తుతం జిల్లాలోని రైతుల తోటలను పరిశీలింపచేయాలి. ఏయే కారణాలతో చీడపీడల తీవ్రత పెరుగుతుందన్న అంశాలను విశ్లేషించి రైతులు, తోటలకు గుత్తకు తీసుకున్నవారికి అవగాహన సదస్సుల ద్వారా వివరించాలి. అవసరమైతే నూతన రసాయనాలను రైతులకు అందించాలి. మామిడి చెట్లకు తగినట్లుగా సేంద్రియ ఎరువులను వేయటం, గుబురుగా ఉన్న, ఎండిన కొమ్మలను తొలగించటం, తోటల్లో చెత్తాచెదారం తీసివేయటం, చెట్లమధ్యన కలుపు లేకుండా దున్నటం, పూతకు ముందునుంచే యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టడం తదితరాలతో చీడపీడలను అదుపుచేసే వీలుందని ఉద్యాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చెట్లను నిరంతరం గమనిస్తూ పూత, పిందె దశల్లోనే శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసులను పాటించాలన్నారు.

# విపక్షాల కూటమి ఇండియా కాదు.. ఘమండియా..!



దిల్లీ: పార్లమెంట్ సమావేశాలు, 2024 లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎన్డీయే ఎంపీలతో ప్రధాని మోదీ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. బిహార్ లోని మిత్రపక్షాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విపక్షాల కూటమిని ఎదుర్కోవడానికి కొత్త వ్యూహాన్ని సూచించారు. ఆ కూటమిని ఇండియా అని కాకుండా ఘమండియా అని పిలవాలన్నారు. హిందీలో దురహంకారి అని దీని అర్థం. కేంద్రంలోని అధికార ఎన్డీయేపై పోరుకు జట్టు కట్టిన విపక్షాలు ఇటీవల తమ కూటమి పేరును ఖరారు చేశాయి.

ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్ (ఐఎన్‌డీఐఏ- ఇండియా) పేరుతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలో దిగాలని నిర్ణయించాయి. కేంద్ర సర్కారు అన్ని వ్యవస్థల్ని కాలరాస్తోందనీ, దానికి దీటైన ప్రత్యామ్నాయ రాజకీయాన్ని తాము అందిస్తామని ప్రకటించాయి. ఈ కొత్త పేరుపై, విపక్ష పార్టీలపై మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌పై మోదీ ఇటీవల కాలంలో విమర్శలు గుప్పిస్తున్నారు. 'వారు తమ కూటమి పేరును యూపీఏ నుంచి ఇండియాకు మార్చుకున్నారు. పేదలకు వ్యతిరేకంగా వారు చేసిన కుట్రలను దాచిపెట్టేందుకే ఈ పేరు మార్పు. వారు దేశభక్తితో కాకుండా.. దేశాన్ని దోచుకోవాలనే దురుద్దేశంతో కొత్త పేరు పెట్టుకున్నారు' అని ఇటీవల మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# ఆప్కాబ్ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం జగన్





విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో పర్యటిస్తున్నారు. నగరంలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్(ఆప్కాబ్) వజ్రోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బ్యాంకు నూతన లోగో, పోస్టల్ స్టాంపును సీఎం ఆవిష్కరించారు. 1963లో ప్రారంభమైన ఆప్కాబ్.. చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతికి పనిచేస్తోంది. ఆప్కాబ్ పరిధిలో 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, 1995 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక రూ.36,732 కోట్ల టర్నోవర్ సాధించింది. 2019 నాటికి కేవలం రూ.13,322 కోట్ల టర్నోవర్‌కే పరిమితమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో 4 ఏళ్లలో రూ.251 కోట్ల లాభాల్లోకి ఆప్కాబ్ వెళ్లింది. ఈ నాలుగేళ్లలో రెండు సార్లు జాతీయ అవార్డులను ఆప్కాబ్ సాధించింది.




## అంగళ్లులో రెచ్చిపోయిన వైకాపా

# చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత

చిత్తూరు: అధికారమే అండగా అన్నమయ్య జిల్లాలోని కురబలకోట మండలం అంగళ్లులో వైకాపా శ్రేణులు రెచ్చిపోయారు. ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరిలో భాగంగా అన్నమయ్య జిల్లాలో చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో తెదేపా శ్రేణులు ఏర్పాటు చేసిన బ్యానర్లను వైకాపా కార్యకర్తలు చించేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తెదేపా కార్యకర్తలపై వైకాపా శ్రేణులు దాడి చేశాయి. వైకాపా రాళ్ల దాడిలో మదనపల్లె మండలం కొత్తపల్లి ఎంపీటీసీ దేవేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను నిలువరించేందుకు ప్రయత్నించారు. రాళ్లదాడి చేస్తున్న వైకాపా కార్యకర్తలను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని తెదేపా శ్రేణులు ఆరోపించారు. గాయపడిన కార్యకర్తలకు వెంటనే చికిత్స చేయించాలి పార్టీ నాయకులను చంద్రబాబు ఆదేశించారు.

**ధైర్యం ఉంటే రండి.. చూసుకుందాం: చంద్రబాబు** – "తెదేపా కార్యకర్తలపై దాడులు చేస్తుంటే పోలీసులు చోద్యం చూశారు. డీఎస్పీ తన యూనిఫామ్ తీసేయాలి. బాంబులకే భయపడలేదు.. రాళ్లకు భయపడతానా? ధైర్యం ఉంటే రండి చూసుకుందాం. పులివెందులకే వెళ్లాను ఇక్కడికి రాకూడదా? నేనూ చిత్తూరు జిల్లాలోనే పుట్టా. పోలీసుల అండతోనే వైకాపా నేతలు రాజకీయం చేస్తున్నారు. ఎవరి జోలికీ మేము పోము.. మా జోలికి వస్తే ఊరుకోము. పుంగనూరు వెళుతున్నా.. అక్కడి పుడింగి సంగతి తేలుస్తా. ఇక్కడ ఒక రావణాసురుడు ఉన్నాడు. అతనికి ట్యాగ్ ఎమ్మెల్యే. ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని హెచ్చరిస్తున్నా. ఇలాంటి నాయకులను రాజకీయంగా భూస్థాపితం చేయాలి. ఇక్కడ జరిగిన ఘటనలో పోలీసుల వైఫల్యం ఉంది. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. అంగళ్లు ఘటనపై విచారణ జరపాలి. రాబోయే రోజుల్లో వైకాపాను తరిమికొట్టే పరిస్థితి వస్తుంది. పోలీసులు ఎవరికి ఊడిగం చేస్తున్నారు. ప్రజలు భూస్థాపితం చేస్తారనే భయంతోనే ఇలా చేస్తున్నారు" అని చంద్రబాబు మండిపడ్డారు.

# జూలై నెలలో టీటీడీకి ఎంత ఆదాయం లభించిందంటే..



తిరుమల : ఆగష్టు 12వ తేదీన శుద్ధ తిరుమల కార్యక్రమం నిర్వహించనున్నట్టు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. నేడు ఆయన మీడియాకు జూలై నెలకు సంబంధించిన వివరాలు దెల్లడించారు. జూలై నెలలో తలనీలాలు విక్రయం ద్వారా తిరుమలకు రూ.104 కోట్ల ఆదాయం లభించిందన్నారు. శ్రీవారిని 23 కోట్ల మంది భక్తులు దర్శించుకున్నారని ధర్మారెడ్డి తెలిపారు. ఇక హుండీ ద్వారా 129.08 కోట్ల ఆదాయం లభించిందన్నారు. కోటి 10 లక్షల లడ్డులను భక్తులకు విక్రయించామన్నారు. 56.68 లక్షల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. 9.74 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా మరమ్మతు పనులను చేస్తున్నామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

# జగన్‌కు సుప్రీంకోర్టులో మరో కేసులోనూ చుక్కెదురు..




ఢిల్లీ : ఏపీ సీఎం జగన్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తొలగించిన యూనివర్శిటీ ప్రొఫెసర్లకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. ప్రొఫెసర్లను కొనసాగించడానికి సుప్రీంలో ఏపీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2019 కు ముందు జరిగిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చెల్లవని జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రొఫెసర్లు హైకోర్టులో సవాలు చేశారు. జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టులో తీర్పు ఇచ్చారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సవాలు చేశారు.

రిజర్వేషన్లను పాటిస్తూనే వారి నియామకం జరిగిందని ప్రొఫెసర్ల తరపు సీనియర్ న్యాయవాది రాజగోపాల్ వాదించారు. రిజర్వేషన్లను అమలు చేసిన తరువాత ప్రొఫెసర్లను ఎలా తొలగిస్తారని జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో ప్రొఫెసర్ల వరకూ కొనసాగించడానికి తమకు అభ్యంతరం లేదని ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాదుల స్టేట్మెంట్‌ను రికార్డు చేసుకొని ప్రొఫెసర్లను వెంటనే నియమించాలని సుప్రీం ధర్మాసనం కోరింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమాకంపై మాత్రం తదుపరి విచారణను వాయిదా వేసింది. నేడు మార్గదర్శి కేసులోనూ జగన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఇక ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసులోనూ చుక్కెదురైంది.




# 'సైలెంట్‌గా ఉండకపోతే.. మీ ఇంటికి ఈడీ వస్తుంది..!'

దిల్లీ: అత్యంత వివాదాస్పదమైన 'దిల్లీ అధికారుల నియంత్రణ బిల్లు' (జాతీయ రాజధాని ప్రాంత సవరణ బిల్లు-2023)ను లోక్‌సభ ఆమోదించింది. విపక్షాల నిరసనల మధ్యే సుదీర్ఘ చర్చ జరిపిన అనంతరం ఈ బిల్లును దిగువ సభ ఆమోదించింది. కాగా.. ఈ చర్చ సందర్భంగా కేంద్రమంత్రి మీనాక్షి లేఖి ప్రతిపక్షాలను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు తాజాగా దుమారం రేపుతున్నాయి. విపక్ష నేతలు సైలెంట్‌గా ఉండకపోతే.. వారి ఇంటికి ఈడీ వస్తుందని ఆమె హెచ్చరించడం గమనార్హం. 'దిల్లీ అధికారుల నియంత్రణ బిల్లు'పై లోక్‌సభలో చర్చ జరుగుతుండగా.. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. అధికార పక్ష సభ్యులు మాట్లాడుతుండగా విపక్ష ఎంపీలు గట్టిగట్టిగా నినాదాలు చేశారు. దీనిపై మీనాక్షి లేఖి స్పందిస్తూ.. "నిశ్శబ్దంగా ఉండండి. లేదంటే మీ ఇళ్లకు ఈడీ అధికారు లు రావాల్సి ఉంటుంది" అని ఆమె హెచ్చరించారు. అనంతరం ఈ బిల్లును సమర్థిస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై పరోక్షంగా లేఖి ఘాటు విమర్శలు చేశారు. ఆయన 'పావు వంతు సీఎం' అని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "దిల్లీలో శాంతి భద్రతలకు సంబంధించిన అంశాల్లో కేంద్రానికే సగం అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. అందువల్ల ఆయన (కేజ్రీవాల్‌ను ఉద్దేశిస్తూ) 1/4 వంతు ముఖ్యమంత్రే" అని విమర్శించారు.

**మేం చెప్పిందే నిజమైంది: విపక్షాలు** – కాగా.. మీనాక్షి లేఖి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని తాము చెప్పిన మాటలు ఇప్పుడు రుజువయ్యాయని విపక్షాలు దుయ్యబట్టాయి. "ఆవేశంలో మీనాక్షి లేఖి విపక్షాలను బెదిరించే ప్రయత్నం చేశారు. మేం చేసిన ఆరోపణలకు ఇదే సాక్ష్యం" అని ఎన్సీపీ తెలిపింది. ఇక, ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ బీవీ స్పందిస్తూ.. "ఇది హెచ్చరికనా? బెదిరింపా?" అని కేంద్రంపై మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్షాలను బెదిరించడం తీవ్ర దిగ్భ్రాంతికరమని టీఎంసీ దుయ్యబట్టింది.



# 'నూహ్' నిందితుల ఇళ్లపైకి బుల్డోజర్లు..!


హరియాణాలోని నూహ్ జిల్లాలో అల్లర్లకు కారణమైన నిందితులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నూహ్ జిల్లాలోని తావుడులో అక్రమంగా నిర్మించిన 250 గుడిసెలను తొలగించారు. అక్రమంగా వలసవచ్చిన వీరు అల్లర్లలో పాల్గొన్నట్లు అధికారులు చెబుతున్నారు. బంగ్లాదేశ్ నుంచి గత నాలుగేళ్లలో వలస వచ్చిన వారు ఇక్కడ స్థలాలను కబ్జాచేసి ఈ పూరి గుడిసెలు నిర్మించినట్లు హరియాణా పట్టణాభివృద్ధి శాఖ చెబుతోంది. భారీ ఎత్తున పోలీసు దళాలు శుక్రవారం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. రాళ్లదాడులు, దుకాణాల లూటీల్లో వీరు పాల్గొన్నారని పోలీసులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు సేకరించారు. ఈ మేరకు వారు దాడులు చేస్తున్న ఫొటోలు, వీడియోలను విడుదల చేశారు. ఇదే విధమైన ఆపరేషన్‌ను నల్హార్ గ్రామంలో కూడా పోలీసులు చేపట్టారు. ఈ గ్రామంలో భారీ సంఖ్యలో వాహనాలను దహనం చేసిన విషయం తెలిసిందే.

నూహ్ అల్లర్ల వెనకు ఉన్న 50 మంది కుట్రదారులను పోలీసులు గుర్తించారు. దీనిపై నూహ్ ఎస్పీ వరుణ్ సింగ్లా మాట్లాడుతూ "స్థానిక శాఖల అధికారులు కూల్చివేతలను చేపట్టారు. మేము వారికి భద్రత కల్పిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఏడీజీపీ మమతా సింగ్ వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న నరేందర్ మాట్లాడుతూ "శాంతిభద్రతలకు సమస్యాత్మకంగా మారిన అక్రమ కట్టడాలను కూల్చేస్తున్నాం" అని వెల్లడించారు. దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన వారిపై స్థానిక అధికారులు 45 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అల్లర్లు జరిగిన మార్గాల్లో అమర్చిన సీసీటీవీల్లో నమోదైన దృశ్యాలను సైబర్ పోలీసుల బృందం సేకరిస్తోంది.


**ఎస్పీ బదిలీ..** ఓ వర్గం ఆధ్యాత్మిక యాత్ర చేపట్టిన సమయంలో సెలవులో ఉన్న నూహ్ జిల్లా ఎస్పీ వరుణ్ సింగ్లాపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తక్షణం భివాని ప్రాంతానికి బదిలీ చేసింది. అతడి స్థానంలో ఏడీజీపీ వద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న నరేంద్ర బిజ్జార్నియాను నూహ్ ఎస్పీగా నియమించింది. నూహ్‌లో యాత్ర సమయంలో వరుణ్ సెలవులో ఉండగా.. పాల్వాల్ ఎస్పీ లోకేందర్ సింగ్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. యాత్ర సమయంలో ఇక్కడ జరిగిన దాడులు.. ఆ తర్వాత మత విద్వేషాలుగా మారి ఇతర ప్రాంతాలకు కూడా పాకిన విషయం తెలిసిందే.

**ఆరావళీ పర్వతాల్లో నక్కిన విధ్వంసకారులు..** నూహ్ అల్లర్లలో పాల్గొన్న వారిలో చాలా మంది విధ్వంసకారులు సమీపంలోని ఆరావళి పర్వతాల్లో నక్కినట్లు ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. పోలీసులు భారీ సంఖ్యలో అరెస్టుల పర్వానికి తెరతీయడంతో వాటిని తప్పించుకోవడానికి ఈ పర్వతాలపై ఉన్న చిన్నగ్రామాల్లోకి వారు చేరినట్లు తెలుస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో అభ్యంతరకర కంటెంట్‌ను పోస్టు చేసిన ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా కేసులు పెట్టారు.

# ముందస్తు ఎన్నికల సంకేతాలు కనిపిస్తున్నాయి: పవన్ కల్యాణ్



మంగళగిరి: ఎన్నికల ఏడాదిలో అడుగు పెడుతున్నాం.. ముందస్తు ఎన్నికల సంకేతాలు కనిపిస్తున్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన క్రియాశీలక నేతలతో పవన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాజా పరిణామాలు చూస్తుంటే ముందస్తు ఎన్నికలు రావొచ్చనిపిస్తోందన్నారు. "డబ్బు తీసుకుని సీట్లు ఇచ్చే సంస్కృతి జనసేనలో లేదు. సామాన్యుడిని రాజకీయాల్లోకి రానివ్వకూడదని వైకాపా భావిస్తోంది. వైకాపా దృష్టిలో రాజకీయం అంటే భయపెట్టడం, బెదిరించడమే. జనసేన నేతలకు త్యాగం, బాధ్యత జవాబుదారీతనం ఉండాలి. జనాల్ని దోచుకునే నేతలు కాదు, తమ సొమ్మును పంచే నేతలు కావాలి. డబ్బుతో ఓట్లు కొనమని నేను చెప్పడం లేదు. కానీ, నాయకులు కావాలంటే ఖర్చు పెట్టి తీరాలి.. తప్పదు. రూపాయి ఖర్చు చేయకుండా ఎవరూ నాయకులు కాలేరు. వచ్చే 25 ఏళ్ల గురించి ఆలోచించే నేతలు కావాలి. భావితరం గురించి ఆలోచించే నేతలు వేరే పార్టీల నుంచి వస్తే ఆహ్వానిస్తాం. మంచి వారినే పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం.. అలాంటి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు" అని పార్టీ నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు.



# మార్గదర్శి కేసు బదిలీపై ఏపీ ప్రభుత్వ పిటిషన్లపై విచారణ అవసరం లేదు: సుప్రీం

దిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్ కేసు బదిలీపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ నిర్ణయం ఇప్పటికే జరిగినందున మళ్లీ విచారణ అవసరం లేదని పేర్కొంది. మార్గదర్శి ఛైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణ్‌పై కఠిన చర్యలు వద్దన్న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని తెలిపింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. కేసులో ఉన్న మెరిట్స్ ఆధారంగా తెలంగాణ హైకోర్టు విచారణ చేపడుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. చెప్పాలనుకున్న విషయాలన్నీ తెలంగాణ హైకోర్టుకే తెలపాలని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాదులకు సూచించింది. హైకోర్టు తుది ఆదేశాలు వెలువడిన తర్వాత సుప్రీంకోర్టుకు రావొచ్చని తెలిపింది.

# గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాల తరలింపు

కర్నూలు: బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు వైద్యులు. అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో ఓ వ్యక్తికి బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో ఆయనకు సంబంధించిన లంగ్స్, కిడ్నీలను హైదరాబాద్, బెంగళూరు ఆస్పత్రులకు గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. ఈనెల 1న బుక్కరాయ సముద్రం గ్రామానికి చెందిన అంకెవల్లి జగదీష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఆయనను అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

జగదీష్‌కు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో వైద్యుల సూచనల మేరకు అంకెవలి జగదీష్ అవయవాలను దానం చేయడానికి కుటుంబసభ్యులు ఒప్పుకున్నారు. దీంతో కిమ్స్ సవేరా ఆస్పత్రి నుంచి జగదీష్ ఊపిరితిత్తులను కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు అంబులెన్స్‌లో అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. అలాగే కిడ్నీలను బెంగళూరుకు రోడ్డు మార్గం ద్వారా అంబులెన్స్‌లో తరలించారు. అవయవాలు తరలింపులో ఐదుగురు వైద్యుల మెడికల్ టీమ్ పాల్గొంది.

# రాశీఖన్నా డేటింగ్ ఇద్దరితో!

టాలీవుడ్ లో ఉన్నంతం కాలం రాశీఖన్నా కామ్ గోయింగ్ నెస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఏ నాడు అమ్మడి పై ఎలాంటి రూమర్స్ రాలేదు. టాలీవుడ్ లో ఏ హీరోతోనూ డేటింగ్ వెళ్లినట్లు గానీ..ఎఫైర్లు నెరిపినట్లు గానీ ప్రచారం కూడా రాలేదు. వివాదాస్పద అంశాలపైనా స్పందించింది లేదు. తనపని తాను చేసుకోవడం తప్ప! ఇవర విషయాలపట్ల అవగాహన లేమిగానే కనిపించేది. అయితే అప్పుడు రాశీ వేరు..ఇప్పుడు రాశీఖన్నా వేరనిపిస్తోంది. కోలీవుడ్ లో బిజీ అవుతున్న దగ్గర నుంచి కొత్త రాశీఖన్నాని పరిచయం చేస్తున్నట్లే కనిపిస్తోంది. ఎఫైర్లు లేవు అనుకున్న రాశీ ఏకంగా ఇద్దరితో డేటింగ్ చేసినట్లు తానే స్వయంగా ప్రకటించి షాక్ ఇచ్చింది. డేటింగ్ కారణంగా బరువు తగ్గానని చెప్పి అడ్డంగా బుక్కైంది. రాశీఖన్నా ఓ దశలో బరువు



బాగా పెరిగిన సంగతి తెలిసిందే. దీనికి కారణం మానసిక ఒత్తిడి అంది. ప్రేమించిన వాడు దూరం ఆకవడంతో డిప్రెషన్ లోకి వెళ్లిపోయిందిట. ఆ సమయంలో విపరీతంగా బరువు పెరిగిందిట. ఆ ప్రభావం తాను నటించే సినిమాల మీద పడిందట. ఫిట్నెస్ ట్రైనర్ పర్యవేక్షణలో ఎంత వ్యాయామం చేసినా బరువు తగ్గలేదుట. దీనికి తోడు థైరాయిడ్ సమస్య కూడా అప్పటికే ఉందిట. దీంతో ఫిట్ నెస్ ట్రైనర్ బరువెందుకు తగ్గలేదని ఎంత ఆలోచించినా అర్దమయ్యేది కాదట. చివరికి ట్రైనర్ ని మార్చినా ఫలితం దక్కలేదుట. అయతే అప్పటికే డేటింగ్ చేసిన వ్యక్తికి దూరమై మరో కొత్త వ్యక్తితో డేటింగ్ మొదలు పెట్టిందిట. ఈసారి మాత్రం బరువు లో భారీ మార్పులే వచ్చాయట. ఇలా ఓపెన్ గా అమ్మడు ఇద్దరితో డేటింగ్ విషయాన్ని బట్ట బయలు చేయడం ఇదే తొలిసారి. టాలీవుడ్ మీడియా అడిగినంత కాలం ఏ రోజు ఈ విషయాన్ని ఓపెన్ చేయలేదు. అయితే రాశీఖన్నా డేటింగ్ చేస్తోన్న ఆ వ్యక్తి పేరు మాత్రం చెప్పలేదు. రాశి ఖన్నా చివరిగా తెలుగు లో హీరోయిన్ గా నటించిన 'పక్కా కమర్షియల్'.. 'థాంక్యూ' చిత్రాలు ఆశించిన ఫలితాలు సాధించని సంగతి తెలిసిందే. ఆ తర్వాత పూర్తి స్థాయి లో కోలీవుడ్ పై దృష్టి పెట్టింది.

## జూనియర్ బుట్ట బొమ్మకి స్టార్ హీరో సినిమాలో ఛాన్స్!

బుట్ట బొమ్మ అనగానే తెలుగు ప్రేక్షకుల్లో చాలా మందికి పూజా హెగ్డే గుర్తుకొస్తుంది అనడం లో సందేహం లేదు. అయితే పూజా హెగ్డే కాకుండా అనిక సురేంద్రన్ ను కూడా బుట్ట బొమ్మ అని ప్రేక్షకులు, మీడియా వర్గాల వారు కూడా పిలుచుకుంటూ ఉంటారు. అజిత్ నటించిన విశ్వాసం సినిమాతో పాటు మరికొన్ని సినిమాల్లో ఆయనకి కూతురు పాత్రలో నటించిన అనిక ప్రస్తుతం హీరోయిన్గా ప్రయత్నాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు లో బుట్ట బొమ్మ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



పాపం అనిక కి ఆ సినిమా కలిసి రాలేదు. దానితో తెలుగు లో ఎక్కువగా ఆఫర్లు రావడం లేదు. ఈ సమయం లోనే ఈ ముద్దుగుమ్మకి తమిళ్ సినిమా ఇండస్ట్రీ నుండి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా తమిళ్ సూపర్ స్టార్ ధనుష్ బెంచ్ మార్క్ సినిమా 50వ సినిమాలో హీరోయిన్గా నటించే అవకాశాన్ని సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్లో భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ధనుష్ అభిమానులతో పాటు సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అనిక కి తమిళ్ తో పాటు తెలుగు లో కూడా మంచి క్రేజ్ ఉంది. అందుకే ఆమె నటించబోతున్న ధనుష్ 50వ సినిమా కోసం ఇక్కడ కూడా కొందరు ప్రేక్షకులు ఎదురు చూసే అవకాశం ఉంటుంది. సార్ సినిమాతో తెలుగు లో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకున్న ధనుష్ తన 50వ సినిమాతో తెలుగులో భారీ వసూళ్లు సొంతం చేసుకుంటాడేమో చూడాలి.

ఈ సినిమాతో అనిక అక్కడ ఇక్కడ మంచి మార్కులు దక్కించుకుంటుంది అనే నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.




# 'జైలర్' కుర్రాడు కాదు తాతగారు...!



తమిళ్ సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన జైలర్ సినిమా వచ్చే వారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఈ మధ్య కాలంలో రజినీకాంత్ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోవడంలో విఫలం అవుతున్నాయి. రోబో సినిమా తర్వాత ఆ స్థాయి విజయాన్ని రజినీకాంత్ అందుకోలేక పోయాడు. భారీ కమర్షియల్ సక్సెస్ లు లేకున్నా కూడా రజినీకాంత్ పై ఉన్న అభిమానంతో తాజా చిత్రం జైలర్ ను చూసేందుకు లక్షలాది మంది అభిమానులు.. ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుగు లో కూడా సాధ్యం అయినంత ఎక్కువ థియేటర్లలో జైలర్ ని విడుదల చేయాలని భావిస్తున్నారు. జైలర్ సినిమా గురించి రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలోనే కథ గురించి ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ సినిమాలో రజినీకాంత్ గత చిత్రాల్లో మాదిరిగా కుర్రాడిగానో... మధ్య వయస్కుడిగానో కనిపించడం లేదు. ఒక తాత పాత్రలో రజినీకాంత్ కనిపించబోతున్నట్లుగా తెలుస్తోంది. 'విక్రమ్' సినిమాలో కమల్ హాసన్ తాత పాత్రలో కనిపించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. మరి ఆ సెంటిమెంట్ ను రిపీట్ చేసే ఉద్దేశ్యమో లేదంటే వయసుకు తగ్గ పాత్ర అనుకున్నాడో కానీ జైలర్ సినిమాలో ఆరు ఏళ్ల బాబుకు తాతగా రజినీకాంత్ కనిపించబోతున్నాడు. కథ విషయానికి వస్తే... రజినీకాంత్ ఒక రిటైర్డ్ జైలర్. ఆయన తనయుడు అసిస్టెంట్ కమీషనర్. ఒక కేసు విచారణ సమయంలో రజినీకాంత్ తనయుడు కనిపించకుండా పోతాడు. దాంతో రంగంలోకి దిగిన మాజీ జైలర్ తన కొడుకును ఎలా కాపాడుకుంటాడు... ఆ కేసును ఎలా సాల్వ్ చేస్తాడు అనేది కథ. కొడుకు యొక్క కొడుకు తో ఉండే సన్నివేశాల్లో రజినీకాంత్ తాతగా అలరించబోతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తానికి జైలర్ కుర్రాడు లేదా అంకుల్ కాదు.. ఒక తాత అని తమిళ్ మీడియాలో ప్రధానంగా ప్రచారం జరుగుతోంది.

# శ్రీలీల చుట్టూ తిరుగుతున్న రామ్..!




రామ్ పోతినేని, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో సినిమా వస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఈ సినిమా కి ఇప్పటి నుంచే మంచి బజ్ వచ్చింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి స్కంద అనే నామకరణం కూడా చేశారు. కాగా, ఇప్పుడు ఈ స్కంద మూవీ టీమ్ కూడా ప్రేక్షకులకు చేరువయ్యేందుకు కసరత్తులు మొదలుపెట్టింది.

ఈ క్రమంలోనే ఈ మూవీ నుంచి ఓ పాట ను విడుదలను చేశారు. నీ చుట్టూ చుట్టూ అంటూ సాగే పాట ప్రోమోని విడుదల చేయడానికి రెడీ అయ్యారు. ఇక పాటకు రామ్, శ్రీలీల డ్యాన్స్ ఇరగదీసినట్లు తెలుస్తోంది. మామూలుగానే రామ్ చాలా ఎనర్జిటిక్ గా డ్యాన్స్ చేస్తాడు. అలాంటి రామ్ కి జోడిగా శ్రీలీల కుదిరింది. ఇప్పుడున్న హీరోయిన్లలో డ్యాన్స్ అదరగొట్టేవారి లో శ్రీలీల పేరు ముందుగా వినపడుతుంది. అలాంటి ఈ ఇద్దరి డ్యాన్స్ కి మంచి పాట పడితే అదిరిపోవడం ఖాయం. ఇప్పుడు ఈ నీ చుట్టూ చుట్టూ పాట లో కనిపించే అవకాశం ఉంది. ఈ పాట లిరికల్ వీడియోని ఆగస్టు 13వ తేదీన విడుదల చేయనున్నట్లు మూవీ టీమ్ పేర్కొంది. దీనికి సంబంధించిన పోస్టర్ కూడా విడుదల చేశారు. అందులో రామ్ చాలా స్టైల్ గా కనిపిస్తున్నాడు. ఇక రామ్ పక్కన శ్రీలీల చాలా అందంగా కనపడుతోంది. నిజానికి రామ్ పక్కన ఏ హీరోయిన్ అయినా తేలిపోయినట్లుగా అనిపిస్తుంది. కానీ, రామ్, శ్రీలీల పెయిర్ మాత్రం అదిరిపోయింది. కాగా, ఈ సినిమా సెప్టెంబర్ 15న విడుదల కానుంది. మొదట ఈ మూవీ ని అక్టోబర్ లో విడుదల చేయాలని అనుకున్నారు. కానీ, ప్రీ పోన్ కావడం విశేషం. కామన్‌గా స్టార్ హీరోల సినిమాల కు సంబంధించి షూటింగ్స్ లేట్ వంటి కారణాల వల్ల రిలీజ్ డేట్ పోస్ట్‌పోన్ చేస్తారు. కానీ రామ్, బోయపాటి చిత్రం మాత్రం అనుకున్న తేదీ కంటే ముందే వస్తుండటంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

ఇదిలా ఉండగా, రామ్ చివరగా వారియర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ మూవీ డిజాస్టర్ గా మారింది. దీంతో, రామ్ ఆశలన్నీ ఈ మూవీపైనే ఉన్నాయి. మరి ఈ మూవీతో ఎంత వరకు ఆకట్టుకుంటాడో చూడాలి.

# ఎద అందాల్లో సారా చిత్తు చిత్తు చేస్తోందే!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సారా అలీఖాన్ బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. 'గ్యాస్ లైట్'..'జర హట్ కే జర బచ్ కే'..'యే వతన్ మేరా వతన్' లాంటి విజయాలతో రెట్టింపు ఉత్సాహంలో కనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో హిందీలోనే నాలుగు సినిమాలు రెడీగా ఉన్నాయి. అవి గాక కొత్త అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఇటు టాలీవుడ్ లో మంచి అవకాశం ఎదురుచూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే రెక్కలు కట్టుకుని వాలిపోవాల ని చూస్తుంది. జాన్వీకపూర్..అలియా భట్.. కియారా అద్వాణీ లాంటి భామలు తెరంగేట్రం చేయడంతో ! ఆ ఛాన్స్ తనకెప్పుడో వస్తుందా? అని ఎదురు చూస్తుంది. వ్యక్తిగతంగా తనను తాను స్పెషల్ గా ఫోకస్ చేసుకోవడంలో అమ్మడు ఎప్పుడు ముందుంటుంది. ఫ్యాషన్ వరల్డ్



లో దూసుకుపోవాలంటే? అందాల ప్రదర్శన తప్పని సరని భావించిన అమ్మడు ఎప్పటికప్పుటు టెంప్టింగ్ ఫోటోలతో కాకలు పుట్టించడం మామూలే. డిజైనర్ దుస్తుల్లో అగ్గి రాజేసే అందాలతో కుర్రాళ్ల హృదయాల్ని ఛిద్రం చేసేస్తుంది. తాజాగా సారా అలాంటి ఫోటోతో ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడి లా ఎద అందాల ఆరబోతతో సలపరం పుట్టిచే బాధ్యతలు తీసుకుంది. బిగువైన లో దుస్తుల్లో అందాల అరబోతకి మతి చెండాల్సిందే. డిజైనర్ రవికలో సారా క్లీవేజ్ సెగలకి చెమటలు పట్టడం ఖాయం. రకరకాల భంగిమల్లో అమ్మడు ఫోజులిప్పుడు సంచలనంగా మారాయి. ఓ భంగిమలో అమ్మడు మలైకా హిప్ ని హైలైట్ చేసిన విధానం సూపర్బ్. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. సారా అందాలకి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. తమదైన శైలిలో కామెంట్లు గుప్పించి సంబర పడుతున్నారు. సారా ఇలాంటి సంచలనాలతో మమ్మల్ని మరింత మురిపించాలంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

## ఆ హీరోయిన్ ని బ్యాడ్ టైమ్ బంతాడేస్తోంది!

హీరోల కు ఉన్నంత లైప్ స్పాన్ హీరోయిన్లకు ఉండదు. ఫేం లో ఉన్నంత కాలం కొనసాగుతారు. ఆ తర్వాత ఇంటికెళ్లిపోతారు. అవకాశాలు రావడం గొప్ప కాదు. వాటిని నిలబెట్టుకుని ముందుకెళ్లడం గొప్ప. ఈ విషయంలో ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ వైఫల్యం లో కనిపిస్తోంది. రొమాంటిక్ సినిమాతో మెరుపు వేగంతో దూసుకొచ్చిన బ్యూటీ కి తొలి సినిమా ఫలితం బెడిసి కొట్టింది. అయినా సరే అమ్మడిలో కొన్ని రేర్ క్వాలిటీస్ కెరీర్ లో ముందుకు తీసుకెళ్లాయి. ఆ వెంటనే 'లక్ష్య'..'రంగరంగ వైభవంగా' లాంటి సినిమాల్లో ఛాన్సులందుకుంది. 'రంగరంగ బాగానే ఆడినా కేతిక పెద్దగా ఫోకస్ కాలేదు. ఇక లక్ష దారుణమైన ఫలితాన్ని చవి చూసింది. ఇలా ఇన్ని వైఫల్యాలున్నా! కేతికకి 'బ్రో' సినిమాలో అవకాశం వెతుక్కుంటూ మరీ వచ్చింది. పవన్ కళ్యాణ్ దేవుడిగా నటించిన సినిమాలో అవకాశం అంటే మాటలా? నిజంగా పెట్టి పుట్టాలి. ఆయన తో సీన్లు లేకపోయినా



సినిమాలో భాగమైతేనే బోలెడంత క్రేజ్ వచ్చేస్తుంది. కానీ ఈ సినిమా విషయంలో అదేం జరగలేదు. సినిమాలో తన పాత్రకి పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంతో ఫోకస్ అవ్వలేదు. సినిమా ఫలితం బాగానే ఉన్నా! కేతిక పేరు పెద్దగా వైరల్ అవ్వడం లేదు. మరి మూడు ప్లాప్ లు చూసి..ఒక హిట్ అందుకున్న భామ కెరీర్ ని ఎలా డిసైడ్ చేయాలంటే? కేతిక ని డ్యాడ్ టైమ్ బంతాడేస్తున్నట్లే కనిపిస్తోంది. హిట్ వచ్చినా గుర్తింపు రాలేదంటే! అంతకు మించిన అన్ లక్ హీరోయిన్ ఎవరుంటారు. చిన్న సినిమా హిట్ అయితేనే నవ నాయికలు బోలెడంత హంగామా చేసేస్తున్నారు.

కానీ కేతిక విషయంలో అలా జరగడం లేదు. మరి అమ్మడు తనని తాను అలా ఫోకస్ చేసుకోవడంలో విఫలమవుతుందా? లేక తెలిసి తెలియని తప్పిదాల కారణంగా అలా జరుగుతందా? అన్నది దృష్టి పెట్టాలి. ప్రస్తుతం కేతిక శర్మ హ్యాండ్స్ లో ప్రాజెక్ట్ లేవి కనిపించడం లేదు. మరి బ్రో విజయం అయినా కొత్త అవకాశాల కు బలమైన పునాది వేస్తుందా? అన్నది చూడాలి.




హైదరాబాద్: రాష్ట్రంలో 2022-23లో ఐటీ ఎగుమతులు 31.4 శాతం మేర పెరిగాయని మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 6లక్షలకు పైగా ఐటీ ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. శాసనసభలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో భూముల రేట్లు బాగా పెరుగుతున్నాయని.. కోకాపేటలో భూముల ధర రికార్డులు బద్దలు కొట్టిందన్నారు. స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్‌షిప్ వల్లే ఇదంతా సాధ్యమైందని చెప్పారు. కానీ ఇవేమీ పట్టనట్లు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో ఐటీని మేమే అభివృద్ధి చేశామని కొంతమంది చెప్పుకుంటారు. కానీ మేం అలా చెప్పుకోం. నగరానికి 1987లో మొట్టమొదటి ఐటీ పరిశ్రమ వచ్చింది. బేగంపేటలోని ఇంటర్ గ్రాఫ్ సంస్థ.. మొట్టమొదటి ఐటీ భవనం. అప్పటి నుంచి 2014 వరకు 27 ఏళ్లలో ఐటీ ఎగుమతులు రూ.56వేల కోట్లు. కానీ గత ఏడాది ఐటీ రంగంలో 57,707 కోట్ల ఎగుమతులు సాధించాం. 27 ఏళ్లలో జరిగింది.. ఇవాళ ఒకే ఒక్క సంవత్సరంలో కేసీఆర్ నాయకత్వం చేసి చూపించింది.

దక్షత, సమర్థత కలిగిన ప్రభుత్వాలు ఉంటే ఇలాంటి ఫలితాలు వస్తాయి. దేశంలో మొత్తం సృష్టించిన టెక్నాలజీ జాబ్స్‌లో 44 శాతం తెలంగాణవే ఉన్నాయి. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకూ ఐటీ పరిశ్రమ విస్తరిస్తోంది. పట్టణాలు, నగరాలు ఎదగాలంటే పరిశ్రమలను ఆకర్షించాలి. ప్రతి చోటా అంతర్జాతీయ ప్రమాణాలను తట్టుకుని నిలబడాలి" అని కేటీఆర్ అన్నారు.




## కేసీఆర్ ప్రభుత్వానికి భారీ షాక్..!!

హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని టీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనుకున్న కేసీఆర్ సర్కార్‌కు అనూహ్య పరిణామం ఎదురైంది. ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఆర్టీసీ బిల్లుని ప్రవేశపెట్టాలనుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఊహించని ట్విస్ట్ ఎదురైంది. ఆర్థిక పరమైన బిల్లు కావడంతో గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం బిల్లుని పంపించగా.. ఇప్పటివరకు గవర్నర్ ఆమోదం లభించలేదు. గవర్నర్ కార్యాలయానికి పంపించామని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. అయితే తమకు ఎలాంటి బిల్లు అందలేదని రాజ్ భవన్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆర్టీసీ బిల్లు విషయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకున్నట్టయ్యింది. ఇదిలావుండగా.. ఆర్టీసీ విలీనం బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందుకు సంబంధించి కేబినెట్ కూడా ఆమోదం తెలిపిన విషయం తెలిసింది. ఇక బిల్లు ఆమోదం పొందితే వచ్చే ఎన్నికల్లో మైలేజీ ఉంటుందని బీఆర్ఎస్ శ్రేణులు ఆశించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆదివారంతో ముగియనున్నాయి. మరి ఏం జరుగుతుందో వేచిచూడాలి.

## తెలంగాణ వస్తే హైదరాబాద్ ఆగమవుతుందన్న వాళ్లకే ఇదే చెంప పెట్టు : సీఎం కేసీఆర్



ప్రభుత్వ వేలంలో హైదరాబాద్ భూములు ఎకరాకు రూ. 100 కోట్లకు పైగా ధర పలకడం తెలంగాణ పరపతికి, సాధిస్తున్న ప్రగతికి దర్పణం పడుతున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలు పోటీ పడి మరీ ఇంత ధర చెల్లించి తెలంగాణ భూములు కొనడాన్ని ఆర్థిక కోణంలో మాత్రమే కాకుండా తెలంగాణ సాధించిన ప్రగతి కోణంలో విశ్లేషించాలని ఆయన అన్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా హైదరాబాద్ నగర అభివృద్ధి సూచిక అందనంత ఎత్తుకు దూసుకుపోతున్న వర్తమాన పరిస్థితికి అద్దం పడుతున్నదని సీఎం తెలిపారు. తెలంగాణ వస్తే హైదరాబాద్ ఆగం అవుతుందని, భూముల రేట్లు పడిపోతాయని ఆనాడు భయభ్రాంతులకు గురి చేశారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు.

ఈ భూముల ధర వ్యవహారాన్ని హైదరాబాద్ ఆత్మగౌరవాన్ని కించపరిచిన వారి చెంప చెళ్లుమనిపించే చర్యగా అర్థం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరెంత నష్టం చేయాలని చూసినా ధృఢచిత్తంతో పల్లెలను, పట్టణాలను ప్రగతి పథంలో నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పట్టుదలకు, హైదరాబాద్ వంటి మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషికి దక్కిన ఫలితమని అన్నారు. హైదరాబాద్ నగరాభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న హెచ్ఎండీఏ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్‌ను కేసీఆర్ అభినందించారు.

**కోకాపేటలో ఎకరానికి 100 కోట్లు :** భూముల వేలంలో కోకాపేట కేక పుట్టించింది. ఒక ఎకరానికి వంద కోట్లకు పైగా పలికి రికార్డుల మోత మోగించింది. ఇది దేశంలోనే అత్యధిక ధరగా నమోదైంది. ఒక లేఅవుట్‌లో ఎకరం స్థలానికి ఇంత పెద్ద మొత్తంలో ధర పలికిన దాఖలాలు లేవని, కోల్‌కతా నగరంలో ఎకరం సుమారు రూ. 72 కోట్ల మేర మాత్రమే పలికిందని నిర్మాణ రంగ నిపుణులు తెలిపారు. కోకాపేట నియోపోలిస్ ఫేజ్-2లో గల 3.6 ఎకరాల ప్రైమ్ ప్లాట్‌ను హెచ్ఎండీఏ వేలం వేసింది. ఆ స్థలాన్ని హ్యాపీ హైట్స్, రాజపుష్ప సంస్థలు కలిసి రూ.362.72 కోట్లకు దక్కించుకున్నాయి. ఈ చిన్న సైజు ప్లాటుకు సరిగ్గా గండిపేట లేక్ వ్యూ ఉండటం, ప్లాటుకు రెండు వైపులా విశాలమైన రహదారి, పక్కన విశాలమైన ఓపెన్ స్పేస్, ఔటర్ రింగురోడ్డుకు అతి సమీపంగా ఉండటంతో అనూహ్యమైన ధర పలి కింది. ఈ స్థలంలో దాదాపు 45 అంతస్థుల వరకు హైరైజ్ భవనాలను నిర్మించి, కనీసం 210 వరకు ఫ్లాట్లను కట్టే అవకాశం ఉంది. ఈ స్థలాన్ని దక్కించుకునేందుకు దిగ్గజ స్థిరాస్తి కంపెనీలు పోటీ పడగా.. వాటిలో హైదరాబాద్‌కు చెందిన కంపెనీలే దక్కించుకోవడం మరో విశేషం.

## వరద నష్టం, పరిహారంపై తెలంగాణ హైకోర్టులో విచారణ.. సర్కార్‌పై అసంతృప్తి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వరద నష్టం, పరిహారంపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది.

వరద నష్టంపై సమగ్ర నివేదికను సమర్పించడానికి హైకోర్టును ప్రభుత్వం మరో రెండురోజుల పాటు గడువు కోరింది. వరద ప్రభావిత భాదితులకు వెంటనే పరిహారం, సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశించాలని పిటిషనర్ కోరారు. అయితే ప్రభుత్వ నివేదిక పరిశీలించిన తరువాత ఆదేశాలిస్తామని న్యాయస్థానం తెలియజేసింది.

తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి (ఆగష్టు 7)కు వాయిదా వేసింది. గతంలో ప్రభుత్వం సమర్పించిన రిపోర్ట్‌పై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. నివేదిక ఇవ్వడానికి ఎందుకు సమయం




తీసుకుంటున్నారని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. సోమవారంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## ఈసారి 'బుద్వేల్'కు నోటిఫికేషన్.. ఎకరాకు కనీస ధర రూ.20కోట్లు




హైదరాబాద్: నగరంలోని కోకాపేట భూములకు రికార్డు స్థాయిలో ధరలు వచ్చిన నేపథ్యంలో అదే తరహాలో బుద్వేల్ భూముల అమ్మకానికి తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో బహుళ ప్రయోజన నిర్మాణాలకు అనుగుణంగా.. మౌలిక వసతులతో అభివృద్ధి చేసిన 100 ఎకరాల స్థలాన్ని హెచ్ఎండీఏ ద్వారా విక్రయించనున్నారు. బుద్వేల్‌లో మొత్తం 14 ప్లాట్లను అమ్మకానికి ఉంచారు. ఒక్కో ప్లాటు విస్తీర్ణం 3.47 ఎకరాల నుంచి 14.33 ఎకరాల వరకు ఉంది. ఎకరాకు రూ.20 కోట్ల కనీస ధరను నిర్ణయించారు. ఆరో తేదీన ప్రీబిడ్ సమావేశం.. ఎనిమిదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నెల 10న ఈ - వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. బుద్వేల్ భూములు ఎకరాకు సగటున రూ.30కోట్ల ధరకు అమ్ముడుపోయినా.. కనీసం రూ.3వేల కోట్ల ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ అంచనా వేస్తోంది.

## ధాన్యం ఉత్పత్తిలోనే కాదు.. డాక్టర్ల ఉత్పత్తిలోనూ తెలంగాణ నెంబర్ వనే



హైదరాబాద్: ధాన్యం ఉత్పత్తిలోనే కాదు... డాక్టర్ల ఉత్పత్తిలో కూడా తెలంగాణ మెదట స్థానంలో ఉందని ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. శుక్రవారం శాసనమండలిలో మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, టీడీపీలు 60 ఏళ్ళల్లో 2 మెడికల్ కళాశాలు ఏర్పాటు చేస్తే.. తొమ్మిదేళ్ళల్లో కేసీఆర్ సర్కార్ 29 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. దేశంలోని మొత్తం ఎంబీబీఎస్ సీట్లల్లో 43 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులు సాధిస్తున్నారన్నారు. పంజాబ్‌ను తలదన్ని... ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ మెదట స్థానంలో నిలిచిందని చెప్పారు. అలాగే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ.. దేశానికి డాక్టర్లను ఉత్పత్తి చేస్తోందదని మంత్రి అన్నారు. ఎంబీబీఎస్ చదువు కోసం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పెద్ద ఎత్తున తెలంగాణకు వస్తున్నారన్నారు. ఉమ్మడి ఏపీలోని పాత ఐదు మెడికల్ కళాశాలల్లో మాత్రమే ఆంధ్ర విద్యార్థులకు 15 శాతం సీట్లు వచ్చేవని.. కొత్తగా ఏర్పడిన 26 మెడికల్ కళాశాలల్లో వంద శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కుతున్నాయన్నారు. అధునాతన సౌకర్యాలతో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై హైకోర్టుకు ప్రభుత్వం అఫడవిట్ సమర్పించిందన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరే ప్రభుత్వ డాక్టర్లకు.. ప్రైవేటు ప్రాక్టీసును నిషేధించామన్నారు. రాష్ట్రంలో కొత్తగా పెట్టే ఎనిమిది మెడికల్ కళాశాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతాయన్నారు. సీఎం కేసీఆర్.. వైట్, పింక్, గ్రీన్, బ్లూ రెవల్యూషన్ తీసుకొచ్చారని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

## పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించండి.. జీవన్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్: పంచాయతీ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పుకు అణుగుణంగా వేతనాలు చెల్లించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ మాట్లాడుతూ... పంచాయతీ ట్రాక్టర్‌లను లైసెన్స్ లేని పంచాయతీ కార్మికులతో నడిపిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు అందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. పంచాయతీ కార్మికుల సమ్మెతో కార్యకలాపాలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం వారిని కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పంచాయితీ కార్మికుల్లో తొంబై శాతం దళితులే ఉన్నారని.. వారితో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని వ్యాఖ్యలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.15,900 జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై మండలిలో వాయిదా తీర్మానం ఇచ్చినట్లు తెలిపారు. వాయిదా తీర్మానంతో అయినా ప్రభుత్వం ఈ అంశంపై చర్చించి వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఆరోగ్యలక్ష్మి పథకం కింద కోటి 93 లక్షల 60 వేల 944 మందికి లబ్ధి : మంత్రి కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్ : రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ఆరోగ్యలక్ష్మి పథకం అద్భుతంగా అమలవుతుందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆరోగ్యలక్ష్మి పథకం అమలుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈశ్వర్ సమాధానం ఇచ్చారు. కోటి 93 లక్షల 60 వేల 944 మంది లబ్ధి పొందుతున్నారు అని ఈశ్వర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలు 20 లక్షల 67 వేల 55 మంది, పాలిచ్చే తల్లులు 19 లక్షల 26 వేల 388 మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసున్న పిల్లలు 97 లక్షల 44 వేల 438 మంది, మూడేండ్ల నుంచి 6 సంవత్సరాల పిల్లలు 54 లక్షల 59 వేల 211 మంది, తక్కువ బరువు గల పిల్లలు ఒక లక్షా 77 వేల 852 మంది ఈ పథకం కింద పోషకాహారం పొందుతున్నారు. జనవరి 2015 నుంచి జూన్ 30, 2023 వరకు 16 వందల 33 కోట్ల 26 లక్షలు ఖర్చు చేయడం జరిగింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య లక్ష్మి గొప్పగా అమలవుతోందన్నారు మంత్రి. మాతాశిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టాం.

గర్భిణిలు, పిల్లలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మెడిసిన్స్ అందించి, రక్తహీనతను నివారిస్తున్నాం. అంగన్‌వాడీల ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నాం అని కొప్పుల ఈశ్వర్ తెలిపారు.

## ఆరు నెలలుగా పోరాడుతున్నా పట్టించుకోరా?.. దుర్గం చిన్నయ్య బాధితురాలి ఆవేదన

న్యూఢిల్లీ: న్యాయం కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బాధితురాలు శేజల్ తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు (శుక్రవారం) తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలియజేశారు. రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కులను కాపాడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసినట్లు శేజల్ తెలిపారు. దుర్గం చిన్నయ్య అనే ఎమ్మెల్యే అన్యాయం చేశాడంటూ గత ఆరు నెలలుగా పోరాటం చేస్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బాధితురాలు విమర్శించారు. మణిపూర్‌లో బాధిత మహిళల కోసం గొంతెత్తుతున్న బీఆర్ఎస్ ఎంపీలు సొంత రాష్ట్రంలో సొంతపార్టీ ఎమ్మెల్యేను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. గత ఆరు రోజులుగా పార్లమెంటు ఎదుట నిరసన తెలుపుతున్నప్పటికీ తెలంగాణ ఎంపీలు పట్టించుకోవడం లేదన్నారు. "మణిపూర్ మహిళలకే హక్కులున్నాయా? నేను మహిళను కాదా? నాకు హక్కులు లేవా?. నేను శాంతియుతంగా నా పోరాటాన్ని కొనసాగిస్తుంటే పోలీసులను అడ్డుకుంటున్నారు. వెంటనే చిన్న దుర్గయ్య మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. ఎఫ్ఐఆర్ అడిగిన ఇవ్వడం లేదు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు. త్వరలో వాటి వివరాలు బయట పెడతా. నాకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం



కొనసాగిస్తా" అంటూ శేజల్ స్పష్టం చేశారు. కాగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను వేధించారని ఆరోపిస్తూ గతంలో రెండు సార్లు శేజల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. మొదట ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విషం తాగి సూసైడ్ అటెమ్ట్ చేయగా.. మరోసారి హైదరాబాద్‌లో మాదాపూర్‌లో నిద్రమాత్రు మింగి బలవన్మరణానికి యత్నించారు. అయితే రెండు సార్లు శేజల్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ శేజల్ తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

## 8 ఏండ్లలో 731 గురుకులాలు స్థాపించాం.. నిర్వహణకు రూ. 13,528 కోట్లు ఖర్చు : మంత్రి కొప్పుల

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో గత 8 ఏండ్లలో 731 గురుకుల పాఠశాలలు, కాలేజీలను ఏర్పాటు చేయడం జరిగింది అని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. గురుకులాల నిర్వహణకు రూ. 13,528 కోట్ల 6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా గురుకుల పాఠశాలల నిర్వహణపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈశ్వర్ సమాధానం ఇచ్చారు. గురుకుల విద్యాసంస్థలు సాధించినటువంటి విజయాలు దేశానికి గర్వకారణంగా నిలిచాయనడంలో సందేహం లేదు అని ఈశ్వర్ పేర్కొన్నారు. ఏ ప్రాంతమైతే విద్యావ్యవస్థలో ఉన్నతంగా ముందుకెళ్తుందో.. ఆ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని సీఎం కేసీఆర్ నమ్మారు. ఈ క్రమంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గురుకులాలు స్థాపించారు. విద్యకు దూరంగా ఉన్న వీరందరికి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. రాష్ట్రంలో గురుకులాలకు ప్రాధాన్యత పెరిగింది. 1971లో నల్లగొండ జిల్లాలోని సర్వేల్‌లో గురుకుల పాఠశాలను స్థాపించారు. ఆ గురుకులంలో చదువుకున్న వారు ఉన్నత స్థానాలకు ఎదిగారు. గత ప్రభుత్వాలు గురుకులాలు స్థాపించినప్పటికీ, వాటిని అభివృద్ధి చేయలేదు. పట్టించుకోలేదు. అందుకే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గురుకులాలకు కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. 731 గురుకులాలను ప్రారంభించి, సకల సౌకర్యాలు కల్పించారు. పాతవి, కొత్తవి కలిపితే 1022 గురుకుల పాఠశాలలు అద్భుతంగా నిర్వహిస్తున్నాం. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని గురుకులాలను ప్రతి సంవత్సరం అప్‌గ్రేడ్ చేస్తున్నాం. డిగ్రీ స్థాయిలో గురుకులాలను స్థాపించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రత్యేక కోర్సులను డిగ్రీ కాలేజీల ద్వారా అందిస్తున్నాం. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గురుకుల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామని తెలిపారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించి, మంచి జీవితాన్ని గడుపుతున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు.

## హైదరాబాద్ యూటీగా మారే రోజు ఎంతో దూరంలో లేదు: అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, బెంగళూర్, చెన్నై, ముంబయి కేంద్రపాలిత ప్రాంతాలు (యూటీ)గా మారే రోజులు ఎంతో దూరంలో లేవని అన్ని ప్రాంతీయ పార్టీలను హెచ్చరిస్తున్నానని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. 'ఢిల్లీ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లును ఎంఐఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఢిల్లీకి సంపూర్ణ రాష్ట్రహోదా కోసం అటల్‌బిహారీ వాజ్‌పేయీ ఈ సభలో బిల్లును ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత బిల్లు ద్వారా గౌరవసభ హోదాను ఈ ప్రభుత్వం కించపరుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీ రాజకీయ పోరాటాన్ని (భాజపా, ఆప్) సభ వెలుపల చూసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంలోని పెద్దల థింక్‌ట్యాంక్ నుంచే బయటకు వచ్చారని అన్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వ మనిషేనని, మీరు అధికారంలో లేనప్పుడు ఆయనను ఆ స్థానంలో ఉంచాలనుకుంటున్నారని కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com